ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

అక్టోబర్ 18, 2009

43199
43800



ప్రతిభకు పట్టాభిషేకం

హ్యాపీబర్త్‌డే

(2009 అక్టోబర్18 నుంచి 2009 అక్టోబర్ 24 వరకు)

ఎం.వైదేహి
అక్టోబర్-19
దేవికారాణి-సీతారాం
పత్తేపురం-ప॥గో॥

జి. విష్ణువర్ధన్
1సం॥,అక్టోబర్-22
కుసుమస్వాతి-రాంప్రసాద్
చల్లపల్లి-కృష్ణా

సిహెచ్. అరవింద్
10సం॥, అక్టోబర్-19
దేవిక-సత్యానందరావు
తిరుమలనగర్-విశాఖపట్నం

దీపారాణి
2సం॥,అక్టోబర్-19
కావేరి-వికాస్‌సింగ్
జగద్గిరిగుట్ట-రంగారెడ్డి

జి.వెంకటరామన్
అక్టోబర్
రజిత-మోహన్‌రావు
వైరా-ఖమ్మం

లోకేశ్వరి
అక్టోబర్
శ్యామల-శ్రీనివాస్
ఫతేనగర్-హైదరాబాద్

వి. దీక్షిత్‌సాయి
1సం॥, అక్టోబర్-2008
రెడ్డిరాణి-సాయివెంకట్
మదనపల్లి-చిత్తూరు

ఎన్.సాయిచరణ్
అక్టోబర్
లక్ష్మీదేవి-చంద్ర
మదనపల్లి-చిత్తూరు

జి.వర్షిత
6సం॥, అక్టోబర్-2003
భువనేశ్వరి-శివశంకర్‌రెడ్డి
మదనపల్లి-చిత్తూరు

ఎన్. సాయిచైతన్య
అక్టోబర్
లక్ష్మీదేవి-చంద్ర
మదనపల్లి-చిత్తూరు

జి.బాలాజీరెడ్డి
1సం॥, అక్టోబర్-2008
భువనేశ్వరి-శివశంకర్‌రెడ్డి
మదనపల్లి-చిత్తూరు

ఎ.సుదర్శిని
4సం॥, అక్టోబర్-2005
దాక్షాయణి-సుబ్రమణ్యం
పెనుమూరు-చిత్తూరు

రాజేశ్వరి
అక్టోబర్
జయ-గోపి
వెంకటేశ్వరనగర్-ఖమ్మం

జి.శశిధర్
అక్టోబర్
పరిమళ-నాగయ్య
ఎర్రగూడూరు-కర్నూలు

ఎం. సుజయ్‌రాజ్
3సం॥,అక్టోబర్-2006
సరోజ-పుల్లారావు
భద్రాచలం-ఖమ్మం

మనలో మాట

ఇదేం న్యాయం...!



నూరేళ్లకు ముందు మాట. మనం అప్పటికింకా పరాయిపాలనలోనే వున్నామని ప్రత్యేకంగా చెప్పనవసరంలేదేమో! గోదారి తీరంలో పేరుగాంచిన న్యాయమూర్తి ఒకరుండేవారు. అమ్మో! ఆయన బహు గడసరి. 'ఆమ్యామ్యా' ముట్టిందో! తీర్పును తిరగరాసి'పడేసేవారు!! ఆ తీర్పుతో తప్పు చేసినవాడు దర్జాగా బయటకు వచ్చేసేవాడు. అయితే అత్యంత రహస్యంగా జరిగే ఈ తతంగాన్ని కందుకూరి వీరేశలింగంగారు కనిపెట్టేశారు. జడ్జీగారు రాసి 'పడేసిన తీర్పు ప్రతులను రహస్యంగా సేకరించి పత్రికలో అచ్చువేయించారు. దాంతో న్యాయమూర్తిగారి 'ఆమ్యామ్యా' బండారం కాస్తా బజారున పడడం...ఆ అవమానం భరించలేక సదరు జడ్జి ఆత్మహత్య చేసుకోవడం వెంటవెంటనే జరిగిపోయింది.

◆◆◆

రాజమండ్రి నుంచి చెన్నపట్నం వద్దాం. ఇక్కడ కూడా 'అలాంటి' జడ్జి ఒకరున్నారు. పేరు దినకరన్. అన్నీ సజావుగా జరిగితే ఈయనగారు మరి కొద్ది రోజుల్లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఠాన్ని అధిష్టించేవారే. వెంట్రుకవాసిలో తప్పిపోయింది. అయినా చేసిన పాపం ఎక్కడకు పోతుందీ! 'నిను వీడని నీడను నేనే' అని పాడుకుంటూ మరీ వెంట రాదూ!! అదే జరిగింది ఈయనగారి విషయంలో. ఈ న్యాయమూర్తిగారు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఐదువందల ఎకరాల ప్రభుత్వ భూమిని దర్జాగా ఆక్రమించేశారు. ఈ విషయం తెలిసి సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఎంపికైన వారి జాబితా నుంచి ఈయనగారి పేరును తొలిగించారు. సరిగ్గా వారం కిందట ఈ వార్త పత్రికల్లో వచ్చింది.

◆◆◆

సాక్షాత్తూ న్యాయమూర్తులే అవినీతికి, అక్రమాలకు పాల్పడిన ఉదాహరణలెన్నిలేవు! వీరి తీర్పులు మాత్రం మరోలా వుంటాయని ఎవరనుకుంటారు!! తన రక్తాన్నే స్వేదంగా మార్చి యజమానికి లాభాలను తెచ్చిపెట్టే కార్మికుడికి సమ్మె చేసే హక్కు లేనేలేదన్న తీర్పు ఇచ్చేశారు కదా.

అందాకా ఎందుకు! 300 ఎకరాల ప్రభుత్వ భూమిని తన తండ్రి కాలం నుంచి అనుభవిస్తున్నామని అప్పటి మన సీఎం వైఎస్సే స్వయంగా చెప్పినా పట్టించుకున్న దిక్కెవరు?

అక్రమంగా వందలకోట్ల రూపాయలు బొక్కేసిన కేసుల్లో ఎందరు పెద్దలపై కేసులు నడవలేదు? ఒక్కరికైనా శిక్ష పడిన దాఖలాలు లేవు కదా. ఏదో నాలుగు రోజులు మీడియాలో గొడవౌతుంది. పదిరోజుల తర్వాత చడీచప్పుడు లేకుండా వారు బయటకొచ్చేస్తారు. అదేమంటే అందుకు సాక్ష్యాలు లేవంటారు.

శకునం చెప్పే బల్లే కుడితిలో పడిందన్న సామెతను గుర్తుచేసుకోవడం మినహా ఏం చేస్తాం? కానీ... శకునాలు, వాటిని బల్లి చెప్పడం ఎంత మూఢ నమ్మకమో! న్యాయమూర్తులు న్యాయంగా ఉంటారన్నది కూడా మూఢనమ్మకమేనా... ఏమో...? అందుకేనేమో... 'చట్టానికి కళ్లు లేవు తమ్ముడూ న్యాయానికి ఇల్లు లేదు ఎప్పుడూ' అన్నారో కవిగారు. ఏమైనా సుప్రీంకోర్టు సదరు కబ్జా న్యాయమూర్తి కేసును తీవ్రంగా పరిగణించడం సంతోషం. ★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	3
రుచి	...	6
తెల్సా	...	7
చిన్నకథ	...	8
సీరియల్	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
క్రైమ్ కథ	...	17
కథ	...	20
చూద్దామా	...	22
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...



స్ఫూర్తి ... 4

విశ్వ విజేత
ఉత్తేజ ప్రదాత

విజ్ఞాన వీచిక ... 9

జలరాజు

సినిమా ... 18

ఫాల్కే అవార్డుకు
సరికొత్త గౌరవం



అలరించిన 'వందేళ్ల వందనాలు'

అక్టోబర్ మొదటివారం సంచికలో కవర్‌స్టోరీ వందేళ్ల వందనాలు బాగా అలరించింది. ప్రసిద్ధులైన శ్రీశ్రీ, దుర్గాబాయి, సుంకర, గోపీచంద్, కాసు బ్రహ్మానందరెడ్డి, ముగ్ధుం మొహియుద్దీన్, కొడవటిగంటి కుటుంబరావు, సుద్దాల హనుమంతు, గౌతు లచ్చన్న వంటి వారు విభిన్న రంగాల, తరహాల తెలుగు జాతిని ప్రభావితం చేసిన ఘనులు. ముఖ్యంగా విద్యార్థులకు, నేటితరానికి ఈ విషయాలు తెలుసుకోవలసిన అవసరం ఎంతోవుంది.

నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం, హైదరాబాద్.

ఆకట్టుకున్న అట్టమీదికథ

అక్టోబర్ 4వ తేదీ ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో అట్టమీది కథ వందేళ్ల వందనాలు చదివిన తర్వాత 2008 నుండి 2010 ముగిసేలోపు అనేకమంది మహోన్నతుల జయంతులు, వర్ధంతులు రావడం, వాటిని అంగరంగ వైభవంగా జరుపుకోవడం హర్షదాయకం. ముఖ్యంగా శ్రీశ్రీ ప్రజాకవిత్వ వైతాళికునిగా తెలుగు సాహిత్యాన్ని విస్తరింపజేసిన మహనీయుడు. కొడవటిగంటి కుటుంబరావు రచనలో అగ్రగణ్యుడిగా వుండి కమ్యూనిస్టు అభిమానిగా చందమామ పత్రికను తీర్చిదిద్దిన ఘనత ఆయనదే. సుంకర సత్యనారాయణ తెలంగాణా సాయుధ పోరాట చరిత్రను కళాత్మకంగా రచించిన వ్యక్తిగా కీర్తిపొందాడు. అలాగే గోపీచంద్ సాహిత్యంపై ఆసక్తిని పెంచుకుని స్త్రీ పాత్రలో చాలా తిరుగుబాటు చూపడం విశేషం. సుద్దాల హనుమంతు, మొహియుద్దీన్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, గౌతు లచ్చన్న, కాసు బ్రహ్మానందరెడ్డిల విశిష్టతను, వారు చేసిన సేవలను చదివిన తర్వాత ఎంతో స్ఫూర్తిని పొందుతాం. మా పాఠశాల విద్యార్థులకు వారి చిత్రపటాలు చూపిస్తూ నోట్సు రూపంలో వారికి అందించాను.

కామిడి సతీష్‌రెడ్డి,
పరకాల, వరంగల్.

తప్పక చదవాల్సిన పుస్తకం

మన దేశంలో ప్రసిద్ధిచెందిన పురాతన చారిత్రక ప్రదేశం లుంబిని గురించి పరిచయం చేసినందుకు ధన్యవాదాలు. సిద్దార్థుని జన్మభూమి కనుక దేశ విదేశాల నుండి బౌద్ధులు యాత్రకు వస్తుంటారు. లుంబినీ వనం, అశోకుని స్థూపం పేరెన్నికగన్నవి. ఇక్కడ చాలా కాలం కిందటే తవ్వకాలు జరిగినా, పరిశోధనలు కావలసినంతగా జరగలేదు. సిపిఎం నేత సింహాద్రి శివారెడ్డిగారికి స్ఫూర్తినిచ్చి కమ్యూనిస్టుగా నిలబెట్టిన పుస్తకం గురించి పరిచయం చేయటం మాలాంటి ఎందరికో స్ఫూర్తినిస్తుంది. నిర్బంధం, శిక్షలు, జైలు జీవితం అనుభవాలు ఆయనను గొప్ప కమ్యూనిస్టుగా మార్చాయి. మహిళా నాయకులకు స్ఫూర్తినిచ్చిన పుస్తకాలను కూడా పరిచయం చేయండి. ప్రజాకవిత్వ వైతాళికుడు, ప్రగతిశీల భావాల ప్రేరకుడు శ్రీశ్రీని, కథానవలా రచయితలకు శిక్షణాలయం వంటి, కొడవటిగంటి కుటుంబరావుని తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటాన్ని కళాత్మకంగా చూపించిన కళాకారుడు సుంకరను, మరో ప్రజాకవి సుద్దాల హనుమంతుణ్ని, రచయత కవి, కమ్యూనిస్టు నాయకుడు అయిన ముగ్ధుం మొహియుద్దీన్‌ను వందేళ్ల వందనాల శీర్షిక ద్వారా పరిచయం చేసిన తెలకపల్లి రవిగారికి వందనాలు. సారంపల్లి మల్లారెడ్డి రచన 'రాష్ట్రంలో రైతు ఉద్యమం, 1947-2007 వరకు జరిగిన విషయాలు ఉద్యమకారులందరూ తప్పక తెలుసుకోవాలి.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

చక్కటి సూచన ఇచ్చారు

అక్టోబర్ 4వ తేదీనాటి స్నేహలో 'ప్రేమరాహిత్యం' కథ చాలా బాగుంది. పిల్లలకు కావాల్సింది తల్లిదండ్రుల ప్రేమ, సాన్నిహిత్యం, ఆప్యాయతలు అని చక్కగా వివరించారు. ఆనంద్, రజితలు ఆశిష్‌ను చదువు గురించి తమకు దూరంగా వుంచి తనను మానసికంగా కృంగదీశారు. రచయిత జి. అనసూయ ఈ కాలం తల్లిదండ్రులకు ఈ కథ ద్వారా చక్కని సూచన అందించారు. పిల్లలకు చదువుతో పాటు ప్రేమ, ఆప్యాయత అందించాల్సిన అవసరం చాలావుంది.

ఎన్. భీమారెడ్డి,
విద్యానగర్, నల్లగొండ.

ముచ్చటగొలిపిన 'రాక్ గార్డెన్'

అక్టోబర్ మొదటివారం స్నేహ సంచికలో అట్టమీది కథగా వందేళ్ల వందనాలు... అంశం ద్వారా ఎందరో మహానుభావుల సంగతులను తెలుసుకోగలిగాం. పళ్లు కుట్టుకునే పుల్లలతో చేసిన 'స్టాన్ మన్రో' ఎగ్జిబిషన్ నిర్మితాలు కనువిందు చేశాయి. అనసూయ గారి 'ప్రేమ రాహిత్యం' కథ బావుంది. 'తెల్సా' విచిత్ర సంగతులు నమ్మశక్యం కావడంలేదు. 'సలహాలు' శీర్షిక న్యాయసంబంధ అంశాలతో ఉపయోగకరంగా వుంది. ఇక చూద్దామాలో రాక్ గార్డెన్ విశేషాలు ముచ్చటగొలిపాయి. రాజేశం గారి 'వానదేవుడేడి' కవిత ప్రస్తుత పరిస్థితులకు విరుద్ధంగా వుందనిపించింది. సినిమా కబుర్లు సత్



కాలక్షేపాన్ని అందిస్తున్నాయి. చివరి పేజీలోని 'సాహసి' కథ మాకు బాగా నచ్చింది. 'గని' సీరియల్ ఉద్విగ్నంగా కొనసాగుతోంది. మనలోమాట చదివాక నాకనిపించిందేమిటంటే 'ముఖ్యమంత్రి'గా పెద్దాయనే కొనసాగి, 'ఉప ముఖ్యమంత్రి'గా అబ్బాయిని ఉంచితే అటు సీనియర్లకు, ఇటు యువ సేనలకు ఆనందదాయకంగా వుంటుంది. వెరసి రాష్ట్రానికీ, కాంగ్రెస్‌కూ మంచిది.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

కళ్లకు కట్టిన కథ

ఎందరో మహానుభావుల గురించి తెలకపల్లి రవి రాసింది చదివాను. ఇది చదివినప్పుడు సమాజం కోసం వ్యక్తులు చేసిన విశిష్టతను చూసే విధానాన్ని తెలుసుకున్నాను. కమ్యూనిస్టు భావాలు ఎంత వ్యక్తిత్వం ఇస్తాయన్నది గ్రహించగలిగాను. అలాగే భావాలు వేరైనా జాతిసమైక్యత కోసం నిలబడడంలో కూడా వ్యక్తిత్వం విలువ పెరుగుతుందని చూడగలిగాను. జి. అనసూయ రాసిన కథ న్యూక్లియర్ ఫ్యామిలీలు ఉపాధికోసం ఏర్పడుతున్నాయని తెలుపుతున్నది. ఇందువల్ల చిన్నారులు ఎలా నలిగిపోతున్నారో కళ్లకు కట్టినట్టు చూపించారు. పెద్దవారమైన మాకు చిన్నారిని దగ్గరకు తీసుకోవాలన్నంత ఆశ కలిగించారు.

ఇలిపిల్ల సూర్యనారాయణ,
భీమనవారిపేట, విజయవాడ.

★

కవిత్వమ్

మన సంస్కృతి మన సంపద

మంత్రి లక్ష్మీనారాయణ

అన్ని అనర్థాలకు కాలం ఒక నెపం
కలికాలం అనుకుంటాము
కాని కాలం దాపురించిందని గొణుక్కుంటాము

హిమాలయాల ఎత్తుగల
మన సంస్కృతి సంప్రదాయాలను
పెకిలించబూనే కుత్సిత కుతంత్రాల కుయుక్తులు

వికృత భావాల వినాశకాల హేల
శృతి మించిన హేయ పాశ్చాత్య
ఖానా...పీనా గానాబజానాల మేళ

గుక్కెడు నీటికోసం గుప్పెడు మెతుకుల కోసం
ఆక్రందనలు ఆవేదనలు
అంధకార కూపంలో అలమటిస్తున్న జనజీవనాలు
పేదరికం నిస్సహాయతతో
ఆకాశానికి చేతులెత్తి ఆక్రోశిస్తుంటే
ఈ మట్టితల్లి అందించిన తిండితిని
ఈ చెట్లు వీచిన గాలి పీల్చి
ఈ పుణ్యనదుల నీరు త్రాగి
ఈ దేశంలో ఆర్జించిన సంపదనంతా ఊర్చుకెళ్లి
విదేశీ బ్యాంకుల్లో పొదగ బెట్టుకునే
ధనిక వర్గ ఖడ్గమృగాల స్వార్థకేళీ

స్విస్ బ్యాంకుల్లో డెబ్భైలక్షల కోట్లు
ఏ తోడేళ్లకు ఆహారమో
ఏ తిమింగళాలకు అల్పాహారమో
ఏమార్చటం ఎత్తుకెళ్లటం కనికట్టుకాదు
విన్నవించటం వినయంగా ఉండటం
కట్టుబాటుకాదు
ఎవరి స్వప్రయోజనాలు వారివి

అడ్డగోలు దోపిడీకి అడ్డుగోడలు వేసేదెవ్వరు
మన సంస్కృతి, సంపదలు హరించుకు పోతున్నా
యుగ ధర్మం అని సంతృప్తి పడదామా
కలికాలం అని సరిపెట్టుకుందామా

★

-సైదులు ఐనాల

ఎంతకీ నా నుండి
విడిపోని పాటని
భుజానేసుకొని
నేను
ప్రజల వాడి నవుతాను
విదిలించిన
భజకీర్తుల నడుమ
పిడికి లెత్తిన, నిశిద్ధ
శిల్పాన్నయి
చౌరస్తాల్లో
కర్రల్ని
నాలుగు గింజల్ని
కలగంటాను
ఈ దేశం నాదేనని
డప్పు మీద
చాటింపేస్తాను.
నేనప్పుడు
ఈ భూప్రపంచాన
సర్వాంతర్యామిగా
ప్రకటన

★

ధిక్కారం

సిహెచ్. మధు

కన్నీటిధారలలో తడిసి ముద్దయిన
ప్రపంచం
సూర్యుణ్ని మసక మసకగానే చూస్తుంది
ఇదంతా డబ్బున్న దోపిడీ గాళ్ల గూర్చి కాదు
వారికి కన్నీరెక్కడిది?
సూర్యుడు అపుడపుడు ఉదయిస్తుంటాడు
మబ్బుల్లో కెళుతూ, కొండల్లో దాక్కుంటూ
అడవితో ఆడుకుంటూ
అపుడపుడు సూర్యుడు తెరపైకి వస్తుంటాడు
ఈ కన్నీరు సూర్యుని కోసం గాదు

కష్టజీవి దు:ఖం ఇది
సూర్యుని కొరకు కన్నీరు కార్చుడు
పిడికిలి ఎత్తుతాడు
ప్రపంచంలో దుఃఖానికి అంతమున్నట్లు లేదు
ప్రపంచ ప్రజల దుఃఖంతోనే
కార్పొరేట్ బ్రతుకుల జెండా
ఎగిరేస్తున్నమాట నిజం
శ్రమ ఫలితంతో వారి ఆటపాట
నా ప్రజలు
ఎన్నో రకాల దుఃఖంతో
ఏకం గాని చూపుతో
తడబాటు అడుగులతో
అపుడపుడు ధిక్కార స్వరాన్ని
వినిపిస్తున్నారు
ధిక్కారంలోనే వెలుగువుంది
ధిక్కారమంటే సూర్యుడేగా

★

స్ఫూర్తి



డా॥ఎస్వీ సత్యనారాయణ,
అరసం అఖిలభారత ప్రధాన కార్యదర్శి.

విశ్వ విజేత ఉత్తేజ ప్రదాత

హైస్కూల్ విద్యాభ్యాసకాలంలో చదివిన గ్రంథాలు కొన్ని మనల్ని ప్రభావితం చేస్తాయి. ఇంకొన్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. మరికొన్ని జీవితాంతం వెంటాడతాయి. ఎనిమిదోతరగతి విద్యార్థిగా ఉన్నప్పుడే, అప్పటి మా ఇంగ్లీష్ టీచర్ పుల్లెల చలపతిరావు ('మంచుపల్లకి' శ్రీపతి) గారు నాతో శ్రీశ్రీ 'మహాప్రస్థానం', గోర్కీ 'అమ్మ' నవల చదివించారు. కొంత అర్థమై, కొంత అర్థంకాక గందరగోళానికి గురయ్యాను. 1969 నాటి జైతెలంగాణా ఆందోళన కాలంలో హైదరాబాద్ పాత నగరంలో 'ఉషస్సు రచయితలు'గా గుర్తింపు పొంది .... పుస్తక పఠనం, లిఖిత పత్రికను వెలువరించడం, గోడపత్రికలను ప్రకటించడం, సభలూ-సమావేశాల్లో క్రియాశీలంగా పాల్గొనడంతో మా సాహిత్యజీవితం ప్రారంభమైంది. 1970వ సంవత్సరంలో కరీంనగర్ నుండి వెలువడే 'విద్యుల్లత' పత్రికలో నా తొలి కవిత అచ్చయింది. నిరంతర అధ్యయనం ఒక వ్యసనంలా మారింది. నా బాల్యమిత్రుడు చింతపట్ల సుదర్శన్‌తో పోటీ పడేవాణ్ణి. హైదరాబాద్ పాతనగరం, శాలీబండాలోని అతి ప్రాచీన గ్రంథాలయం 'భారతగుణవర్థక సంస్థ'లో ఉన్న బాలసాహిత్యమంతా చదవడం పూర్తి చేశాం. జూలియస్ ఫ్యూజిక్ 'రక్తాక్షరాలు', జాక్ లండన్ 'ఉక్కుపాదం' సృష్టించిన అలజడి నుండి తేరుకుకోకముందే తెన్నేటిసూరి రచించిన 'ఛంఘిజ్‌ఖాన్' నవల నా చేతిలో పడింది. ఎన్నిసార్లు చదివానో చెప్పలేను. ఇంటర్ విద్యార్థిగా ఉన్నప్పుడు ఈ నవలలో ఉల్లేఖించిన పాటలన్నీ నోటికొచ్చేవి. పాత్రల పేర్లు, ప్రవర్తనలు, లక్షణాలన్నీ నిత్యస్మరణీయాలుగా మారిపోయాయి. నా మరో బాల్యమిత్రుడు ఎం.ఏ.సత్యనారాయణరావు (టెలిఫోన్‌శాఖలో ప్రస్తుతం ఉద్యోగి)తో కలిసి ఈ నవలను చదవడం, చర్చించుకోవడం, పులకించి పోవడం ఎంతో పారవశ్యంతో జరిగేది. అనేకమంది మిత్రులతోనూ, తరువాతి కాలంలో శిష్యులతోనూ 'ఛంఘిజ్‌ఖాన్' నవలను చదివించాను.

హెన్రీహెచ్.హోవర్తు దంపతులు తమ జీవిత సర్వస్వాన్ని త్యాగం చేసి రూపొందించిన మంగోల్ చరిత్ర ఆధారంగా తెన్నేటిసూరి రచించిన గొప్ప నవల ఇది. కేవలం 123 గుడిసెలు లేదా డేరాలు గల గోబీజాతి తండా నాయకుడు ప్రపంచంలో ముప్పాతికవంతు భూభాగాన్ని జయించి ఒక మహా సామ్రాజ్యాన్ని స్థాపించాడు. 12,13 శతాబ్దాల కాలంలో ఈ భూమ్మీద పుట్టి, కష్టనిష్టూరాలను అనుభవించిన మంగోల్ జాతి ప్రజల చరిత్రను కళ్లకు కట్టినట్లు ఈ నవలలో తెన్నేటిసూరి ఆవిష్కరించాడు. చరిత్రనూ, చారిత్రకాంశాలనూ కాల్పనిక నవలగా రూపొందించడం కష్టసాధ్యమైన పని. అందులోనూ మనకు తెలిసిన జీవితం కాదు. మనకు పరిచయమైన సంప్రదాయాలూ, ఆచారాలూ కావు. ఎంతో శ్రమకోర్చి, విషయసేకరణ చేసి, తెన్నేటిసూరి సరైన పద్ధతిలో వ్యక్తీకరించిన అపూర్వ రచన 'ఛంఘిజ్‌ఖాన్'.

'జాజ్వల్యమానంగా నెగళ్లు మండుతున్నాయ్. ఆ జ్వాలా రేఖల్లో నిగనిగలాడే నల్లటి ఊలు పట్టాలతో దింపిన డేరాలు మిలమిలా, చలచలా మెరుస్తున్నాయ్'.

వలయాలు వలయాలుగా పేర్చిన ఆ పిడకల దాళ్లమీద గొర్రె మాంసం, గుర్రపు మాంసం బానల తరబడి ఉడుకుతోంది. మాంసం ఉడుకుతున్న వెగటు వాసన ఆ కొండ చరియలనిండా మత్తుగా వ్యాపిస్తోంది. నెగళ్ల చుట్టూ స్త్రీపురుషులు మైమరచిన ఆనందంతో కోలాహలంగా నృత్యాలు చేస్తున్నారు. తోలు తిత్తుల్లో నుంచి బియ్యపు సారా మంచినీళ్లలా ప్రవహిస్తోంది'.

ఈ ఎత్తుగడతో నవల ప్రారంభమవుతుంది. చదవడం ప్రారంభించాక, పూర్తయ్యేవరకూ వదలబుద్ధికాదు.

బూర్‌ఖాన్ పర్వతం, సారీకీహర్ మైదానం, తార్‌తార్ తండా, గోబీ ప్రజలు, ఆటవిక ఆచారాలు, ప్రాక్తన విశ్వాసాలు, ఆనాటి పెళ్లిళ్లు, పురుళ్లూ, విందులూ, వినోదాలన్నీ పాఠకుల మెదళ్లముందు ఒక అద్భుత ప్రపంచాన్ని ఆవిష్కరిస్తాయి.

తార్‌తార్ తండాలో పుట్టిన శిశువు ఎడమ గుప్పిలి ముడుచుకునే ఉంది కానీ, కుడి అరచెయ్యి ముడుచుకునిలేదు. అరచేతికి మధ్యగా ఎద్దు మూపురంలా ఒక మాంసఖండం వుబ్బెత్తుగా లేచి ఉంది. అది చూడగానే తండాప్రజలు 'జగజ్జేత' అని అరిచారు. చంఘిజ్‌ఖాన్ అంటే ప్రపంచ విజేత అని అర్థం. అతని అసలు పేరు టెమూజిన్ అంటే ఉక్కుమనిషి. బట్‌టెంగ్రీ టెమూజిన్ పూర్తిపేరు. బాల్యం నుండే సాహసోపేతమైన

ఇవన్నీ నూనూగు మీసాల నూతన యవ్వనంలోకి అడుగుబెట్టిన నామీద ప్రగాఢమైన ప్రభావాన్ని చూపాయి. హైదరాబాదు పాత నగరంలోని ఒక చిన్న మురికివాడలో పుట్టిన నేను డిగ్రీ విద్యార్థిగా ఉన్నప్పడే ఛంఘిజ్‌ఖాన్ స్ఫూర్తితో సాటి యువకులను సమీకరించి, యువజన సంఘాన్ని స్థాపించి, స్థానికంగా కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న కల్తీసారా(గుడుంబా) వ్యాపారస్తులను ప్రతిఘటించాం. వీధి పోరాటాలు జరిగాయి. మళ్లీ నిలదొక్కుకుని కల్తీసారా వ్యతిరేకపోరాటాన్ని కొనసాగించి, విజయం సాధించగలిగాం. క్రమంగా పాతనగరంలో మా బలం, బలగం పెరిగింది. కల్తీసారా వ్యాపారస్తులు, స్థానిక వీధిరౌడీలు మాతో శత్రుత్వం పక్కనబెట్టి, గౌరవించడం మొదలుపెట్టారు.

కార్యాలు, నాయకత్వ లక్షణాలు ప్రదర్శించిన టెమూ, తన తండా ప్రజల్లో అపారమైన ఆత్మవిశ్వాసాన్ని నింపాడు. క్రమంగా చిన్నచిన్న తండాలను జయించి, సైనిక శక్తిని పెంచుకున్నాడు. గోబీ ఎడారిలో ఆనాడున్న వందల జాతులను, వేలాది తండాలను జయించి తమ తండాలో కలుపుకున్నాడు. మైదాన ప్రాంత రాజకుటుంబ కలహాలను ఒడుపుగా ఉపయోగించుకున్నాడు. ఒకరికి ఆశ్రయమిచ్చి, వారి ఖర్చులతో ఆయుధాలను సమకూర్చుకుని మరొకర్ని తుదముట్టించాడు. సైనిక వ్యూహాలతో, తగిన ఎత్తుగడలతో పొరుగున ఉన్న చైనా చక్రవర్తులను గడగడలాడించాడు. మంగోల్ తండాను మహత్తరమైన శక్తిగా రూపొందించాడు.

'టెమూజిన్ మానవమాత్రుడు కాదు, భగవంతుని అవతారం. ఆసియాలో ఉన్న పీడిత ప్రజానీకాన్నంతా ఉద్ధరించడానికి భగవంతుడే గోబీ ఎడారిలో టెమూజిన్‌గా అవతరించాడు. టెమూజిన్ను మానవమాత్రుడెవడూ జయించలేడు. అతడనేక మహత్తులు చూపిస్తున్నాడు. ఉన్నవాడు ఉన్నపళంగా అదృశ్యమైపోయి, మళ్లీ ఎక్కడో కనబడతాడు. మృగ, పక్షి రూపాలలో సంచరిస్తాడు. గాలివానలనూ, మంచు తుఫానులనూ సృష్టించి శత్రువులను నాశనం చేస్తాడు. శత్రు సేనల మీద చలి జ్వరాలూ, విషజ్వరాలూ ప్రయోగించి, నేలమట్టం చేస్తాడు' అనే ప్రచారాన్ని మంగోలు ప్రజలు ఆసియాదేశాల్లో కొనసాగించారు.

మరోవైపు శత్రువులు "ఆసియా ప్రజలందరూ నాశనమైపోయే ప్రమాదస్థితిలో ఉన్నారు. గోబీలో టెమూజిన్ అనే రాక్షసుడు పుట్టాడు. మంగోల్ తండాలన్నీ రాక్షస తండాలే. వాళ్లు మనుషుల్ని చంపుతారు. మానవుల పచ్చి మాంసాన్నే పీక్కుతిని బతుకుతారు. వాళ్లలో దర్మాధర్మాలూ, నీతినియమాలూ ఉండవు" అంటూ ప్రచారం చేసే పరిస్థితులు ఏర్పడిన వాతావరణాన్ని చక్కని కథాకథనంతోనూ, సందర్భోచితమైన వర్ణనలతోనూ చిత్రించిన తెన్నేటిసూరి దృశ్యకావ్యమీ నవల.

టెమూజిన్, చమూగా, ఫామాన్, యూలన్, యాసుకైఖాన్, తుఘ్రల్‌ఖాన్, కరాచర్, గుయుక్షి, సుబుటాయ్, చెపేనాయన్ వంటి అనేక పాత్రలు పాఠకులను కలవరపెడతాయి. గుర్తుండిపోతాయి.

ఛంఘిజ్‌ఖాన్ జీవితాన్ని గురించి పాశ్చాత్య రచయితలు ఎన్నో గ్రంథాలు రచించారు. అతణ్ని ఒక రాక్షస మానవుడిగానే చిత్రీకరించారు. ఆసియా గడ్డమీద ఒక మహా మానవుడు పుట్టాడని అంగీకరిస్తే, పాశ్చాత్య నాగరికతకు తలవంపు వస్తుందన్న భావనతో కూడిన వక్రీకరణలు, వ్యాఖ్యానాలతో కూడిన గ్రంథాలే ఎక్కువగా వెలువడ్డాయి.

'ఛంఘిజ్‌ఖాన్ నా ఆదర్శవీరుడు' అన్నాడు స్వతంత్ర భారత తొలిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, తన జీవిత చరిత్రలో గోబీ ప్రజలకు ప్రేమపాత్రుడైన మానవుడు. మంగోల్ ప్రజానీకానికే కాక, ఆసియాఖండానికి యావత్తూ మహోజ్వలమైన భవిష్యత్తును నిర్మించిన మానవుడిగా ఛంఘిజ్‌ఖాన్‌ను విశ్లేషించాడు నెహ్రూ.

"ఒక చిన్న మంగోల్ తండాలో పుట్టిన ఛంఘిజ్‌ఖాన్ అపారమైన ఆత్మవిశ్వాసంతో, గొప్ప నాయకత్వ లక్షణాలతో ఒక మహాసైన్యాన్ని నిర్మించగలిగాడు. మైదాన ప్రాంత రాజులను, రాజ్యాలను ధిక్కరించగలిగాడు. ఎప్పటికప్పుడు అవసరమైన సైనిక వ్యూహాలను రచిస్తూ, పురోగమించాడు. ఎన్నో ఎగుడుదిగుళ్లనూ, ఒడిదుడుకులనూ అధిగమించాడు".

ఇవన్నీ నూనూగు మీసాల నూతన యవ్వనంలోకి అడుగుబెట్టిన నామీద ప్రగాఢమైన ప్రభావాన్ని చూపాయి. హైదరాబాదు పాత నగరంలోని ఒక చిన్న మురికివాడలో పుట్టిన నేను డిగ్రీ విద్యార్థిగా ఉన్నప్పుడే ఛంఘిజ్‌ఖాన్ స్ఫూర్తితో సాటి యువకులను సమీకరించి, యువజన సంఘాన్ని స్థాపించి, స్థానికంగా కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న కల్తీసారా(గుడుంబా) వ్యాపారస్తులను ప్రతిఘటించాం. వీధి పోరాటాలు జరిగాయి. మళ్లీ నిలదొక్కుకుని కల్తీసారా వ్యతిరేకపోరాటాన్ని కొనసాగించి, విజయం సాధించగలిగాం. క్రమంగా పాతనగరంలో మా బలం, బలగం పెరిగింది. కల్తీసారా వ్యాపారస్తులు, స్థానిక వీధిరౌడీలు మాతో శత్రుత్వం పక్కనబెట్టి, గౌరవించడం మొదలుపెట్టారు.

ఇదే స్ఫూర్తితో హైదరాబాద్ పాతనగరంలో మతకలహాలు తీవ్రమౌతున్న రోజుల్లో కేవలం పదిమంది యువకులం లాఠీలు చేతబట్టుకుని ముస్లిం స్త్రీలకు రాయ్‌మహబూబ్ నారాయణ (డా॥రాజ్‌బహద్దూర్ గారి బంధువు) ఇంట్లో ఆశ్రయమిచ్చి, రక్షణ కల్పించాం.

1970వ దశకంలోనే పాతనగరంలోని వైదిక ధర్మ ప్రకాశినీ హైస్కూల్ ప్రాంగణంలో హైదరాబాదు పాతనగర రచయితల మహాసభలు నిర్వహించాం. సుప్రసిద్ధ అభ్యుదయ రచయితలెందరో ఆనాటి సభల్లో పాల్గొన్నారు. మతోన్మాదులు సభలను భగ్నం చేయడానికీ, దాడి చేయడానికీ వస్తున్నారని తెలిసి యువరచయితలందరం లాఠీలు పట్టుకుని సభా ప్రాంగణాన్ని కాపాడుకున్నాం.

అభ్యుదయ రచయితల సంఘంలో ఒక సాధారణ కార్యకర్తగా చేరి... అరసం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టడానికి ... ఆత్మవిశ్వాసాన్ని, స్ఫూర్తిని నింపిన సాహిత్యగ్రంథాలెన్నో ఉన్నాయి. వాటిలో ప్రథమ స్మరణీయ నవల- ఛంఘిజ్‌ఖాన్'.

★



తెలుగువారికోసం... తెన్నేటిసూరి

మహావీరుడు ఛంఘిజ్‌ఖాన్ గాథను తెలుగు ప్రజలకు పరిచయం చేసిన తెన్నేటిసూరి 1911లో పుట్టాడు.

'నీ కవిని బ్రతికించుకోవాలిరా
నీవు మనిషనిపించుకోవాలిరా!' అని ప్రబోధించాడు. 1945-1957 మధ్యకాలంలో భారతి, ఆంధ్ర పత్రికలలో పత్రికా రచయితగా పనిచేశాడు. 'విప్లవ రేఖలు', 'సుబ్బలక్ష్మి' కథల సంపుటాలు, 'అరుణరేఖలు', 'మహోదయం' కవితాసంపుటాలు, 'నారాణి' నాటికనూ ప్రకటించాడు. 'సాహిత్య సమవాకారము' పేరిట వ్యంగ్యరచనను వెలువరించిన తెన్నేటిసూరి 'రెండు మహానగరాలు' స్వేచ్ఛానువాద నవలను రచించారు. 1954 నాటి అంతర్జాతీయ కథల పోటీలో వీరికథ 'భారతి' పురస్కారాన్ని పొందింది. హేతువాదిగా, భౌతికవాదిగా, అభ్యుదయ రచయితగా ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపిన ప్రతిభాశాలి తెన్నేటిసూరి 48 సంవత్సరాల పిన్నవయస్సులోనే తుదిశ్వాస విడిచాడు.

'కూడుగుడ్డా నీరు కావాలి అన్నాడు
తనమాట మరిచి మన కొరకె వాపోయాడు
రచ్చలో మన మాట తెచ్చి వాదించాడు
విచ్చుకలమూని మన శత్రువుల చీల్చాడు'
సూరి జీవితం, వ్యక్తిత్వం, సాహిత్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకం.

ఆలూ పూర్ణాలు

కావలసిన పదార్థాలు

ఆలూ(బంగాళదుంపలు)–1/2 కిలో
పంచదార – కప్పు
యాలకులు – 3 (మెత్తగా పొడిచేసుకోవాలి)
నూనె – వేయించడానికి సరిపడా
జీడిపప్పు – 50 గ్రాములు, మైదా– కప్పు
బియ్యంపిండి – కప్పు, వంటసోడా – చిటికెడు
పచ్చికొబ్బరి తరుగు – 1/2 కప్పు
నెయ్యి – 2 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం

మైదా, బియ్యంపిండి, వంటసోడాలను కలిపి దానిలో కొద్దిగా నీళ్ళు పోసి దోశ పిండిలా కలిపి రెండు గంటలు నాన బెట్టాలి.











బంగాళదుంపలను ఉడకబెట్టి పొట్టు తీసి మెత్తగా మెదుపుకోవాలి. ఒక గిన్నెలో పంచదార పోసి కొద్దిగా నీళ్ళు పోసి స్టవ్ మీద పెట్టి కలుపుతూ లేత పాకం (ఒక ప్లేటులో నీళ్ళపోసి పాకం వేస్తే మెత్తగా ఉండ అయితే చాలు) వచ్చేవరకూ తిప్పుకోవాలి. అందులో మెదిపి పెట్టుకున్న బంగాళదుంప ముద్ద, యాలకులపొడి, నేతిలో వేయించిన జీడిపప్పు వేసి కలపాలి. తరువాత చిన్న చిన్న ఉండలు (పూర్ణాలు మాదిరి) చేసి పెట్టుకోవాలి. బంగాళదుంప ఉండల్ని ముందుగా కలిపి పెట్టుకున్న మైదా, బియ్యంపిండి మిశ్రమంలో ముంచి కాగిన నూనెలో వేసి దోరగా వేగనివ్వాలి. అంతే ఆలూ పూర్ణాలు రెడీ. నోట్లో వేసుకుంటే మెత్తమెత్తగా తియ్య తియ్యగా భలే ఉంటాయి. మరి మీరూ ప్రయత్నిస్తారుగా!

బాదం హల్వా

కావలసిన పదార్థాలు

బాదంపప్పు – 200 గ్రాములు
పంచదార – కప్పు, పాలు – 1/2 కప్పు
యాలకులపొడి – అరస్పూను
పచ్చకర్పూరం – చిటికెడు, నెయ్యి – కప్పు
జీడిపప్పు, కిస్మిస్–50 గ్రాములు

తయారుచేసే విధానం

బాదంపప్పు మునిగేలా నీళ్ళుపోసి నాలుగు గంటలు నానబెట్టాలి. అంత సమయం లేకపోతే బాగా మరిగించిన నీటిలో గంట నానబెట్టినా చాలు. తర్వాత పై పొట్టు తీసేసి నీళ్ల పోసి మిక్సీలో వేసి పాలుపోస్తూ మెత్తగా రుబ్బుకోవాలి. తర్వాత అందులోనే పంచదార కూడా వేసి కలపాలి. సన్నని మంటమీద మందపాటి గిన్నెలో ఈ మిశ్రమాన్ని వేసి దగ్గరపడేవరకూ కలుపుతూ ఉండాలి. దించేముందు నెయ్యి, యాలకులపొడి, పచ్చకర్పూరం, నేతిలో వేయించిన జీడిపప్పు, కిస్మిస్‌లు వేసి బాగా కలియబెట్టాలి. హల్వాని గరిటెతో తీసి చేత్తో పట్టుకొంటే అంటకపోతే తయారయిపోయినట్లే. అంతే బాదం హల్వా రెడీ. ఇది చాలా మృదువుగా రుచిగా ఉంటుంది.

సేమ్యా హల్వా

కావలసిన పదార్థాలు

సేమ్యా – కప్పు, పంచదార – కప్పు
నెయ్యి – 1/2 కప్పు
యాలకుల పొడి – 1/2 టీ స్పూన్
పచ్చికొబ్బరి తురుము– కప్పు
జీడిపప్పు, కిస్మిస్– 50 గ్రాములు

తయారుచేసే విధానం

స్టవ్ మీద బాండీ పెట్టి రెండు టీస్పూన్ల నెయ్యి వేసి జీడిపప్పు, కిస్మిస్ వేయించుకోవాలి. తర్వాత సేమ్యా కూడా దోరగా వేయించుకోవాలి. అడుగుమందంగా ఉన్న గిన్నెలో మూడు కప్పుల నీళ్ళు పోసి మరిగించాలి. మరిగే నీటిలో సేమ్యా వేసి ఉడికిన తర్వాత పంచదార వేసి కలపాలి. పంచదార వేయడం వల్ల కొద్దిగా పలచగా అవుతుంది. అది గట్టిపడే వరకూ తిప్పుతూ ఉండాలి. తర్వాత నెయ్యి, యాలకులపొడి, జీడిపప్పు, కిస్మిస్ వేసి బాగా కలిపాలి. హల్వా గిన్నెకు అంటుకోకుండా ఉంటే రెడీ అయిపోయినట్లే. స్టవ్ మీద నుంచి దించి వడ్డించుకుని వేడివేడిగా తినొచ్చు. లేదా చల్లార్చి ఫ్రిజ్‌లో పెట్టుకొని చల్లచల్లగా కూడా తినొచ్చు. మీ ఇష్టం మరి..

పోకుండలు

కావలసిన పదార్థాలు

బియ్యం – 2 కప్పులు
బెల్లం – కప్పు (పొడిచేసి కొలవాలి)
తెల్లనువ్వులు – 4 టీ స్పూన్లు
నెయ్యి – 2 టీ స్పూన్లు
ఎండు కొబ్బరి – కప్పు (తురుము)

తయారుచేసే విధానం

బియ్యం నానబెట్టి పిండిచేసుకోవాలి. ఆ పిండిని మెత్తగా జల్లించుకోవాలి. నువ్వులపప్పును నూనె వేయకుండా బాండీలో దోరగా వేయించుకోవాలి. అదే బాండీలో నెయ్యి వేసి ఎండుకొబ్బరి తురుమును వేసి దోరగా వేపుకోవాలి. ఇప్పుడు అడుగు మందంగా ఉన్న గిన్నె స్టవ్ మీద పెట్టి బెల్లంపొడి వేసి కొద్దిగా నీళ్ల పోసి పాకం వచ్చే వరకూ కలుపుతూ ఉండాలి. పాకం ఉండకడితే (ఒక ప్లేటులో నీళ్లపోసి పాకం వేస్తే ఉండ కట్టాలి) చాలు. అప్పుడు బియ్యం పిండిని కొద్ది కొద్దిగా వేసి కలుపుకోవాలి (చలిమిడిలాగా) స్టవ్ మీద బాండీ పెట్టి నూనె పోసి బాగా కాగనివ్వాలి. ఈలోగా పిండిని చిన్న ముద్దలుగా తీసుకొని గుండ్రంగా రెండు చేతుల మధ్య ఉంచి నున్నగా చుట్టి నూనెలో వేసి గోధుమరంగులోకి వచ్చేవరకూ వేయించుకోవాలి. గాలి చొరని డబ్బాలో వేసి పెట్టుకొంటే 15రోజుల వరకూ నిల్వ ఉంటాయి. ఇవి తినడానికి చాలా బాగుంటాయి.

- ఓలేటి సామ్రాజ్యం,
ఉండవల్లి, గుంటూరు జిల్లా.

నిధుల సరస్సు

కొలంబియా పర్వతాల్లోని గ్వాటిలిటా సరస్సు నిధుల సరస్సుగా గుర్తింపు పొందింది. ఆ ప్రాంతంలో శతాబ్దాల క్రితం నివాసమున్నట్లు భావిస్తున్న చిబ్చా ఇండియన్లు ఆ సరస్సులోకి పెద్ద ఎత్తున బంగారాన్ని, వజ్రాలను విసిరేవారని ఇప్పటికీ విశ్వసిస్తున్నారు. చారిత్రక ఆధారాలను బట్టి ఈ సరస్సును గురించి ఈ వింత ప్రచారం కొనసాగుతూ వస్తోంది. తల నుండి కాలివేళ్ళ వరకూ బంగారాన్ని ధరించిన చిబ్చా నాయకుడు సంవత్సరానికి ఒక రోజు ఈ సరస్సులో స్నానం చేసేవాడని ఆ రోజు మిగతా చిబ్చా జాతి వారంతా ఈ సరస్సులోకి వజ్రాలను, బంగారాన్ని విసిరేవారని నమ్మకం. దాంతో 16వ శతాబ్దం నుండి ఇప్పటి వరకూ సరస్సులో నిధుల కోసం ఐరోపా వారు ప్రయత్నిస్తూనే వున్నారు. అయితే ఇంత వరకూ ఎవరూ సఫలీకృతులు కాలేదట.

వింత ప్రవర్తనలు

మనుషుల్లో మాదిరిగానే జంతువుల్లో కూడా కొన్ని చిత్ర విచిత్రమైన వింత ప్రవర్తనలు, అలవాట్లు వున్నాయి. న్యూజిలాండ్‌కు చెందిన 'కీ' అనే పక్షి చిలుక జాతికి చెందినది. అయితే ఇది పూర్తిగా మాంసాహారి. దక్షిణ అమెరికాలో వుండే, 'రాకాసి పాండా' పెద్ద కోరపళ్ళతో భయంకరంగా ఉంటుంది. అయితే ఈ జంతువు మాత్రం వెదురు చిగుళ్ళు మాత్రమే కొరక్కుతింటుంది. బల్లి జాతికి చెందిన బాసిలిస్క్ అనే జంతువు వెనుక కాళ్ళ సాయంతో నీటిమీద సైతం పరుగెత్తగలదు. ఈదగలదు. కేట్ ఫిష్ అనే చేప నీటితో నిండిన సొరంగాల్లో తలక్రిందులుగా ఈదుతుంది. సెయిల్ ఫిష్ అనే చేప అతి వేగవంతమైంది. ఇది గంటకు 109కి.మీ. వేగంతో ఈదగలదు.

చేపల్లో 'సిచ్‌లిడ్' అనే పేరుగల చిన్న రకం చేపలు అపాయాన్ని పసిగట్టినప్పుడు తమ సంతానాన్ని నోట్లో పెట్టుకొని రక్షిస్తాయి. సముద్ర గుర్రం ఆడగుర్రం పెట్టిన గుడ్లను తన కడుపులో పెట్టుకుని పొదుగుతుంది. 'బర్రా' అనే భయంకరమైన అతి పెద్ద చేప వాడికోరలను 'రాసే' అనే పేరుగల చిన్న పక్షులు ముక్కులతో పొడిచి శుభ్రం చేస్తాయి. 'పెయింటెడ్ స్నైప్' అనే పేరుగల పక్షులలో మగవాటి కన్నా ఆడపక్షులు పెద్దవిగా వుంటాయి. ఆడపక్షి ఆహార సంపాదనకు వెళితే మగపక్షి పిల్లల్ని సాకుతుంది.



తెలుసా!



తమలపాకుల కోసం కిరీటం తాకట్టు

ఈ రోజుల్లో కిళ్ళీలు వేసుకోని వారుండరంటే అతిశయోక్తి లేదు. తమలపాకు సేవనం ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. జాజి, జాపత్రి లవంగాలు, యాలకులు తదితరాలతో తాంబూల సేవనం ఒక భోగంగా పరిగణిస్తారు. కాశ్మీర్‌రాజు అనంత్‌కు తాంబూలం అంటే ప్రాణం. తమలపాకులు నమలనిదే ఆయనకు తోచేది కాదట! కాశ్మీర్‌లో తమలపాకులు లేని కారణంగా, ఆయన బయటి రాష్ట్రాల నుంచి వాటిని తెప్పించుకునేవాడు. పద్మరాజు అనే 'అతి తెలివి' వ్యాపారి రాజుగారికి తమలపాకులు నిరంతరం సరఫరా చేస్తూ విపరీతంగా డబ్బు తీసుకోనేవాడు. రాజు ఒకసారి డబ్బులేక అత్యవసర పరిస్థితులలో తమలపాకుల కోసం తన కిరీటాన్ని పద్మరాజుకు తాకట్టు పెట్టాడు. ఈ పరిస్థితిని చూసిన రాణి సూర్యమాత రానున్న ప్రమాదాన్ని పసిగట్టి పద్మరాజు అప్పులు తీర్చి అతడిని దేశం నుంచి బహిష్కరించింది. రాజప్రాసాదంలో ఎవరూ తమలపాకులు వేసుకోరాదంటూ శాసనం విధించింది.

డేంజర్ దుంప

నైజీరియాలోని కొందరు డాక్టర్లు జరిపిన ప్రయోగాలలో గర్భిణీ స్త్రీలు కసావాదుంపలు (మోరం గడ్డలు) వాడటం వల్ల వారికి పుట్టబోయే బిడ్డలకు మెదడు, నాడీ మండలం దెబ్బతింటాయని వెల్లడించారు. ఆ దుంపలో పిండి పదార్థమే వుంటుంది. మాంసకృత్తులు అసలే వుండవు. ఆసియా, ఆఫ్రికా దేశాలలో చాలా మంది ఈ రకం దుంపలను ఆహారంగా వాడతారు. మనదేశం దక్షిణ ప్రాంతాల్లో కూడా వీటిని తింటారు. ఆ దుంపలు ఎక్కువగా తినడం వల్ల పోషకాహార విలువలు పడిపోతాయి. ఆ దుంపలను ఎక్కువగా వాడిన స్త్రీలకు పుట్టిన పిల్లల్లో చాలా మంది వెంటనే మరణించారని ఓ సర్వేలో తేలింది.



దాగిన సత్యం

-అచరా

రోడ్డుమీద బెవర్సుగా తిరిగినోల్లు, దివాళాతీసేసినోల్లు ఒక్కసారిగా లక్షాధికార్లు అయిపోతున్నారు. ఏ దేవుడు దయవల్లో, ఏ బాబా దీవనలవల్లో ఆల్లు పెద్దోల్లు అయిపోయారనుకొంటారు గాని బాబూ, ఏదో ఒక రహస్యం వుంటాది. మనకి తెలీదు. ఈ ముష్టోల్లు తెల్లారినుండి బాబా బజనలు సేస్తారు.

'అమ్మవారి పండుగలో అపశ్రుతి. సిరిమాను ఉట్టినుండి ప్రమాదవశాత్తూ జారిపడ్డ దమ్మల పైడితల్లి మృతి'.

పైడితల్లి చచ్చిపోయాడు. కళ్లు చెమ్మగిల్లాయి. మసకబారాయి. తరువాత మరి చదవలేకపోయాను.

నాలుగురోజుల క్రితం పైడితల్లితో మాట్లాడాను. అమ్మవారి గుడి ముందు కూర్చున్నాడు. చాలా సంవత్సరాల తరువాత అమ్మవారి గుడికి ఇదే రావడం. ఉద్యోగరీత్యా పదిహేను సంవత్సరాలు కేరళలో వుండిపోయాను.

'ఏం పైడితల్లీ బాగున్నావా? ఇక్కడ కూర్చున్నావేం?' అని అడిగాను.

'మరెక్కడ కూకుండేది?'

అమ్మవారి గుడి అనేవాళ్ళం. కాని అది ఒక గది. ఒంటిరెక్క తులుపుండేది. తలుపుకి జేగురు రాసి ఎర్రగా వుండేది. లోపల అమ్మవారినుంచేవారు. వెళ్ళి దర్శనం చేసుకొని కోరికలు చెప్పుకొనేవాళ్లం. పక్కగదిలో పైడితల్లి ఉండేవాడు. వంశపారంపర్యంగా వాళ్ల అమ్మవారిని సేవిస్తూ వస్తున్నారు.

'మరెక్కడ కూకుండేది?' కటువుగా ప్రశ్నించాడు. గుప్పుమని సారావాసన. బీడీ దమ్ములాగి 'అటు సూడండి' అన్నాడు. ఔను. ఇప్పుడు అమ్మవారి గుడి పాత ఇల్లు కాదు. అప్పుడు రోడ్డుకు దూరంగా రెండు గదులుండేవి. దోనె పెంకుతో ఏసిన ఇల్లు. గడపలో కూర్చొని బీడీ తాగుతూ పైడితల్లి అందరినీ ఆప్యాయంగా పలకరించేవాడు. 'అమ్మవారికి మొక్కుకోండి. గొప్ప సత్తువైన తల్లి. మీరు పస్టుక్లాసులో పాసవుతారు" అనేవాడు.

ఇప్పుడు అమ్మవారికి గుడికట్టారు. రోడ్డుకు కొంచెం దూరంలో పెద్ద గోపురం. గోపురం ముందు ముష్టివాళ్లు, వెనక గర్భగుడి. దాని చుట్టూ ఖాళీస్థలం. మొజాయిక్ ఫ్లోరింగ్. భక్తులు ప్రదక్షిణ చేస్తున్నారు. అమ్మవారి ఎదురుగా పెద్ద హుండీ.

'హుండీకూడా పెట్టారే?' అన్నాను.

'ఉండీ ఎనకాలున్న అమ్మోరుని చూడండి. పాలరాతివిగ్రహం. పెద్ద పెద్ద కళ్లు. ఎర్రని నాలిక. బయమేస్తాది. తల్లి సల్లగా సూడాలగానీ, ఇదేటి? అమ్మోరంటేటి? సల్లదనం. ఒట్టి పసుపు ముద్ద. కోడికూసేయేల కొత్తబుట్ట నిండా పసుపుముద్ద ఏసుకొని ఊరవతలున్న అమ్మోరు చెట్టుదగ్గర మూడుముద్దలుంచి ఉపారంపెట్టి ఎలిపోస్తాం. మల్లీ అద్దరాత్రిరిపూట మేలాలతోటెల్లి సూసీవోల్లం. ఆటిలో ఒకటి ఎర్రగా పండుతాది. జిగజిగా ఎలిగిపోతాది. అప్పుడు ఆ అమ్మోరుని బుర్రమీదెట్టుకొని ఊళ్ళోకి తెచ్చీవోల్లం. ఈ గదిలో నిలిపేవోల్లం. తమలాంటోల్లు దరిసనం సేసుకొని మీ మనసులోని కోరిక సెప్పుకొనేవోల్లు. నేనెప్పుడైనా అక్కడ వుండేవాడ్నా? మీరే డైరెక్టుగా మాట్లాడీవోల్లు. తల్లీ నాకది కావాలి, ఇది కావాలి అని చెప్పుకొనీవోల్లు. ఇంత పసుపు తీసుకొని బొట్టెట్టు కొంటే కోరిక తీరతాదని నమ్మకం. మీలాటోల్లేసిన పావలో, అర్దో ఆ రోజుకి నా తిండికి సరిపోయేది. అమ్మోరు ఊరులోవుంటే దీపం కర్చు, నైవేజ్జం కర్చు అని ఎక్కువరోజులు వుండనిచ్చీవోల్లుకాదు. ఇప్పుడు సూడండి. అమ్మోరూరొదిలెల్లదు. కొబ్బరికాయలు, అరిటి పల్లు, హారతి కర్పూరాలు. ఎవరికీ బాదనేదు. టిక్కట్టు తీసుకొని దరిశనం కోసం గంట క్యూలో నిలబడతారు. మీ తరుపున పూజారే అబిషేకం సేసిస్తాడు. మంత్రాలు సదివీస్తాడు. ఇప్పుడు అమ్మోరికి మన బాషరాదు బాబూ. మర్సిపోనాది. అంతా దేవబాషే. నీకూ నాకూ అర్థం కాదు. నీ కోరికలీవైనా వుంటే నువ్వే మనసులో అనీసుకోవాలి. బయట నుండే దరిశనం సేసుసుకోవాలి. పూజారి నీ పల్లెంలో ఇంత కుంకం, రెండు పువ్వులు, కొబ్బరి చిప్ప పెడ్తాడు. బాబూ నిన్ను నిలిసోబెట్టే మాటాడతున్నాను. తమలాటోల్లని ఆ పాకలోకి రమ్మంటే బాగోదు. ఉడిపీఓటల్లో కూకొని మాట్లాడుకొందాం. తమతో చాలా మనవి చేసుకోవాలి, పైడితల్లికి నాలుగిడ్లీ సాంబారు చెప్పాను. రెండుపూరీ ఆర్డరు ఇచ్చాను. 'ఆతల్లిని మేం తరతరాలుగా సేవించుకుంటూ వొస్తన్నాం. గొప్ప సత్తువైన తల్లి అని నమ్మినాం. ఆ తల్లి దయవల్ల మాకు కూడుకీ, గుడ్డకీ లోటు లేకుండాపోయింది. అమ్మోరు పేరు దమ్మలోడి తిండి అంటారు. బాబూ మేం తిండికి మాత్రమే సూశాం. మేడలూ, మిద్దెలూ కట్టలేదు. అందుకే అమ్మోరికి గూడ పెద్ద కోవెల కట్టించలేకపోయినాం. పూర్వం నుండి వున్న అదే ఇల్లు ఆ తల్లికి గుడి.

'రోడ్డుమీద బెవర్సుగా తిరిగినోల్లు, దివాళాతీసేసినోల్లు ఒక్కసారిగా లక్షాధికార్లు అయిపోతున్నారు. ఏ దేవుడు దయవల్లో, ఏ బాబా దీవనలవల్లో ఆల్లు పెద్దోల్లు అయిపోయారనుకొంటారు గాని బాబూ, ఏదో ఒక రహస్యం వుంటాది. మనకి తెలీదు. ఈ ముష్టోల్లు తెల్లారినుండి బాబా బజనలు సేస్తారు. భక్తులు ఇచ్చిన ప్రసాదాలు తింటారు. దేవతల ఎదుటే పొద్దస్తమానం తిరుగుతూవుంటారు. ఆల్లు పెద్దోల్లు అయిపోవద్దా? ఈ మిస్టరీ ఏటి? సెప్పండి'.

ఇద్దరం చెరోకప్పు టీ తాగి రోడ్డుమీదకొచ్చాం. ఆలయం కమిటీ వుంది. అబిరుద్ది సేస్తన్నారు. అమ్మోరి దరిశనానికి టికట్టు, కొబ్బరికాయ కొట్టడానికి రేటు. ఆరతికి రేటు. ఉండీలోకి డబ్బు. ఇదంతాఏటవుతుంది. సందాలు వసూలు సేసి బ్రమ్మాండమైన గుడి కట్టేసినారు. ఇంకా ఇంకా వొచ్చే డబ్బుతో అమ్మోరికి నగలు సేయిస్తారట, సత్రాలు కట్టిస్తారట. బాబూ ఈ సొమ్మంతా ఎక్కడికెల్తంది? సిమ్మెంటు పేక్టరీలకే, వైజాగ్ స్టీలుప్లాంటుకే కదా. ఉండీలో పేదోల్లేసిన సొమ్ము పెద్దోల్లకే సరిపోతుంది, చిన్న చిన్న గెడ్డలో నీల్లన్నీ పెద్దేటిలో కలసిపోయినట్టు. బాబూ ఆ అమ్మోరే నిజంగా కోరికలు తీర్చేదే అయితే ఈ ముష్టోల్లు ఇక్కడ ఎందుకుండాలి? నేను ఇలాగ రోడ్డుమీదెందుకుండాలి?' అంటూ దీనంగా చూశాడు. ఒక పదిరూపాయలు పైడితల్లి చేతిలో పెట్టాను. పైడితల్లి కళ్లలో నీళ్లు తిరిగాయి. చెయ్యి వణుకుతూ వుంది. దుఃఖాన్ని దాచుకోవడం కోసం ముఖం పక్కకుతిప్పుకొన్నాడు. అలాగే వెళ్లిపోయాడు.

"ఆత్మహత్య చేసుకొన్న అమ్మవారి సేవకుడు" అని ఎవరైనా రాశారేమోనని అన్ని పత్రికలూ తిరగేశాను. లేదు, బయటికి కనిపించేదే సత్యం. కనిపించని కారణం శాశ్వతంగా సమాధైపోయింది.

★



జలరాజు

- డా॥కాకర్లమూడి విజయ్

మానవుడు చంద్రుడిపై కాలుమోపి, అక్కడి ధూళిని, శిలలను భూమికి తీసుకువచ్చినప్పటి నుండి చంద్రుడి ఉపరితలం పరమ పొడిగా ఉందని అనుకునేవాళ్లు. కానీ ఎప్పటికప్పుడు వస్తున్న తాజా పరిశోధనా ఫలితాలు చంద్రుడిపై జలం ఉందన్న వాదనను బలపరుస్తూ వస్తున్నాయి. ఆ క్రమంలో చందమామపై నీళ్ల ఆనవాళ్లు కనిపెట్టిన ఘనత మన చంద్రయాన్-1దే కావడం విశేషం. గత నాలుగు దశాబ్దాలుగా అంతరిక్ష శాస్త్రవేత్తలను అనుమానాలలో పడేసిన అంశం ఇప్పుడు తేటతెల్లమైంది. మనం ప్రయోగించిన ఒక చంద్రయాన్-1లో నాసా పంపించిన మూన్ మినరాలజీ మ్యాపర్ ద్వారా లభించిన సమాచారాన్ని విశ్లేషించిన తరువాత తేలిన విషయం - చంద్రుడిపై నీరుంది! ఆ విశేషాలేంటో చూద్దామా!

నెలవంకపై నీరైతే ఉందని తెలిసింది గానీ ఎంత మోతాదులో ఉందో, ఏ రూపంలో ఉందో ఇంకా తెలీదు. కానీ చంద్రుడి ధ్రువప్రాంతాలలో ఎక్కువగానూ, మిగతా ప్రాంతాలలో కొన్ని మిల్లీమీటర్ల మందమైన పొరల్లో ఉండవచ్చని అంచనా. మూన్ మినరాజీ మ్యాపర్‌కి చంద్రుడి ఉపరితలంపై నుండి కొన్ని మిల్లీమీటర్ల లోతు వరకు మాత్రమే పరిశీలించే శక్తి ఉంది. అందువల్ల ఎంతమేరకు నీరు ఉందో స్పష్టంగా తెలిసే అవకాశం లేదు.

అయితే చంద్రుడిపై నీటి ఉనికిని చంద్రయాన్-1 కంటే ముందుగానే క్యాసినీ (ఈ నౌక 1999లో చంద్రుడికి అతి దగ్గరగా ప్రయాణించింది), ఆ తరువాత 'డీప్ ఇంపాక్ట్' అనే అంతరిక్ష నౌక కూడా చంద్రుడి ధ్రువాల దగ్గర నీటి ఉనికి గురించి సమాచారమిచ్చాయి.

అయితే ఈ సమాచారం అప్పట్లో సూచనప్రాయంగానే లభించింది. క్యాసినీ శనిగ్రహం వైపు ప్రయాణిస్తూ ఉండగా ఈ వివరాలందిస్తే, డీప్ ఇంపాక్ట్ అల్ట్రా వయోలెట్ కిరణాల ఆధారంగా సూచించింది. కానీ చంద్రయాన్ మాత్రం ఆ వివరాలను నిర్ధారించింది.

నీరు చంద్రుడిపై ఎక్కడ, ఎలా, ఎంత ఉంది అన్న విషయాలపై రానున్న రోజుల్లో మరింత పరిశోధన జరుగుతుంది. అంతకు ముందే మరో అద్భుత ప్రయోగం జరిగింది. అక్టోబరు 9న నాసా చంద్రుడిపై ఒక 'బాంబు' ప్రయోగించింది! బాంబంటే బాంబు కాదు- నాసా ప్రయోగించిన ఎల్‌సిఆర్‌ఒఎస్ఎస్(లూనార్ రికనైసెన్స్ ఆర్బిటర్) అనే ఉపగ్రహం రెండు టన్నుల 'ఆయుధాన్ని' బుల్లెట్ కంటే రెండింతల వేగంతో (గంటకు సమారు 5600 మైళ్ల వేగం) చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో ఢీకొనేలా వదిలింది. తద్వారా జరిగిన విస్ఫోటనంలో జలరాశి ఉనికి గురించి మరింత సమాచారం లభించనుంది.

ఇంతకీ చంద్రుడిపై నీళ్లుంటే ఏమిటి? లేకపోతే ఏమిటి? అసలెందుకీ జలాన్వేషణ?

మనకి అవగతమైన మేరకు జీవం పుట్టుకకు నీరు అవసరం. మనకి తెలిసిన అణువులు మనకు తెలిసిన విధంగా కలిస్తే నీరు ఏర్పడుతుంది. చంద్రుడిపై కూడా అటువంటి అణువుల ఆనవాళు న్నాయి. కాబట్టి అవి నీటిని ఏర్పరిచే అవకాశం ఉందని మన అంచనా. ఎక్కువో, తక్కువో ఒకవేళ అక్కడ నీరే గనక ఉంటే మరో దశాబ్దకాలంలో చంద్రుడిపై మానవుల జీవనానికి అనువుగా గుడారం వేద్దామనుకున్న ప్రణాళికలకు మంచి ఊతం దొరికినట్టే! నాసా 2020 కల్లా చంద్రమండలంపై రికానా ఏర్పరచాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. అక్కడ నీరు ఉండే పక్షంలో ఆ ప్రయోగాలు దాదాపు విజయవంతమైనట్టే.

ఈ సందడిలో అక్టోబరు 9న ప్రయోగించిన రాకెట్టుబాంబు కొందరికి ఇబ్బందిగా ఉంది. ప్రశాంతంగా ఉండే చంద్రమండలంపై ఈ 'విధ్వంసకర' చర్యలేమిటని వారి అభ్యంతరం. చంద్రమండలంపై నీరుండడం విశేషమనుకుంటున్న వారికి మరో వార్త - నాలుగు దశాబ్దాల క్రితం చంద్రుడిపై దిగిన ఆర్మ్‌స్ట్రాంగ్‌కి ఆవ్‌డ్రిన్‌కి మనకు కనిపించని చంద్రుని సగం(మనకి ఎప్పుడూ చంద్రుడి ఒక సగమే కనిపిస్తుంది) పై గ్రహాంతర వాసుల ఆనవాళ్లు కనిపించాయట. ఆ విషయం నాసా ఇప్పటికీ రహస్యంగానే ఉంచిందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇది ఎంతవరకు వాస్తవమో మనకి ఇప్పుడిప్పుడే తెలిసే అవకాశం లేకపోయినా, చాలా విషయాలను నాసా మరుగున ఉంచుతుందన్నది వాస్తవం.

చంద్రుడిపై నీటి విషయంలో మన ఇస్రో పాత్రని అభినందిస్తూ, రానున్న రోజుల్లో నెలరాజు జలరాజో కాదో తెలుకుందాం. ✶



సీరియల్

గని

<u>*జరిగిన కథ : -*</u>

తమ బాధలన్నీ పక్కనబెట్టి యథావిధిగా పని చేసుకుపోతుంటారు కార్మికులు. బేస్ వద్ద నీళ్లు ఎప్పటి కంటే ఎక్కువగా ఉండడంతో ప్రమాదమేదైనా జరగబోతుందేమోనని అనుకుంటారు. 'అయినా ఇప్పుడు మాత్రం అనుభవిస్తుందేమిటి కటిక పేదరికమే కదా! దాని కంటే చావే మేలు' అనుకుంటూ తమ పనిలో మునిగిపోతారు. తర్వాత వారి కష్టాలూ, బాధలూ ఒకరితో ఒకరు చెప్పకుంటారు. మర్నాడు జీతాలిచ్చేరోజు కావడంతో ఆనందంతో పనికి బయలుదేరతారు. కొత్త స్థలంలో బొగ్గు తవ్వకానికి నెంబరు ఇస్తాడు సర్వేయరు. సమ్మెకు అవసరమైన ఏర్పాట్ల గురించి చర్చించడానికి ఆ రోజు బికాస్ కార్మికసంఘాల చైతన్య సమావేశానికి వెళ్తాడు. సమ్మె గురించిన విషయాలు రాబట్టుకోవడానికి ప్రయత్నించబోతాడు మిత్రా. దిలీప్‌కు అణుచుకోలేనంత కోపం వచ్చినా మౌనంగా ఉండిపోతాడు. దిలీప్ ముఖకవళికలు గమనించిన మిత్రా 'ఆ...ఆ.. పని కానివ్వండి' అంటూ నెమ్మదిగా జారుకుంటాడు. ఇంతలో ప్రమాదాన్ని సూచిస్తూ ఓ పెద్ద శబ్దం. ఆ తర్వాత...

తమిళ మూలం : **కె. చిన్నప్పభారతి**

అనువాదం : **వి. వెంకటేశ్వర**

(ఇరవై తొమ్మిదవ భాగం)

ఒకానొక గుంపులోకి పులి చొరబడితే, ఆ గుంపులోని మనుషులు తమ చెంతనున్న పెళ్ళాం బిడ్డల్నీ, తల్లిదండ్రుల్ని పట్టించుకోకుండా బతుకుజీపితో పరుగు లంకించుకున్నట్టు కార్మికులు పారిపోతున్నారు. కొందరు కాళ్ల తడబడి కింద పడితే, మరికొందరు పట్టాలు తగిలి కింద పడ్డారు. బొగ్గుతొట్టెను ఢీకొని కొందరు తలలు పగులగొట్టుకొన్నారు. గుడ్డిగా పరుగెత్తి గోడకు కొట్టుకొని పడ్డారు కొందరు. ఇలా అందరూ నువ్వా, నేనా అన్నట్టుగా నిచ్చెనకేసి పరుగెత్తారు. ప్రాణాలు దక్కించుకోవాలన్న తాపత్రయంలో నియమనిబంధనల్ని తుంగలో తొక్కారు. తమకన్నా ముందుగా నిచ్చెనపెట్టెలో చేరిన వాళ్ళను బయటికి లాగేయాలని ప్రయత్నించారు. ఒకరు చెబితే మరొకరు వింటారా? అక్కడే ఉండిపోయి చావడం కన్నా తన్నుకు చావడం మేలనిపించింది. కొందరు మాత్రం ఇలా పద్ధతీ పాడూ లేకుండా ప్రవరిస్తే అందరూ హతులవడం ఖాయమంటూ హెచ్చరించారు. తల పగిలిన కార్మికుడొకడు 'నాకు కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. నన్ను ముందుగా బయటికి చేర్చండి' అన్నాడు. తొక్కిసలాటలో గాయపడ్డ మరో కార్మికుడు 'నా మోకాలిచిప్ప పగిలింది. ఆ..! అయ్యో..! నన్ను బయటికి చేర్చండి' అన్నాడు. కొంతమంది 'ప్రాణం మీద ఆశ ఎవరికి మాత్రం లేదు. వరుసక్రమంలో వెళ్ళాల్సిందే' అంటూ గోలపెట్టారు.

ప్రమాదం ఏమిటో ఎవరికీ అంతుబట్టలేదు. ప్రతి ఒక్కరికీ ఎప్పుడెప్పుడు క్షేమంగా బయట పడతామా అని ఉంది. మరొకరు బతకడం కోసం మనమెందుకు చావాలి! అన్న ప్రాథమిక స్వార్థ చింతన బలంగా అల్లుకుంది. క్రిమికీటకాల్లాంటి కార్మికుల గురించి యాజమాన్యానికి ఏమాత్రమూ ధ్యాస లేదు. ఆ కొయ్యగుర్రం దృష్టిలో మనుషుల ప్రాణాల కన్నా కాసుల గలగలలే మిన్న.

తొక్కిసలాటలో చిక్కుకున్న కార్మికులు అచ్చోసిన ఆంబోతుల్లా ఒకర్నొకరు ఢీకొంటూ కిందపడ్డ వాళ్ళను తొక్కేస్తూ పరుగెత్తుతున్నారు. మానవీయమైన దయాదాక్షిణ్యాలకు అక్కడ తావులేదు. మృత్యువు వాళ్ళను తరుముతోంది. పెళ్ళాంబిడ్డలు కళ్ళముందు మెదులుతున్నారు. తమ మీదే ఆధారపడ్డ ముసలి తల్లిదండ్రుల జ్ఞాపకాలు ముసురుకొంటున్నాయి. దరిద్రపు గొట్టు జీవితం గడుపుతున్నా జీవితం మీద ఎంత వ్యామోహమో! కోటికి పడగలెత్తినవాడైనా, కూటికి గతిలేని వాడైనా జీవనకాంక్షా, జీవితం తాలూకు ఆకాంక్షలూ తరతమభేదంతో ఉండకపోతాయా! మామూలు సమయాల్లో కంటే, ప్రాణాల కోసం పోరాడుతున్న సందర్భంలోనే మానవునిలో అన్ని రకాల దిగుళ్లూ అనేక బాధలూ ఏకీకృతమై మరికొంత కాలం జీవించగలిగితే తన కుటుంబసభ్యుల కోసం ఏదైనా చేసి మరీ దాటుకొంటానుగదా అనే తలంపు కలగడం సహజం. గనిలోపల చిక్కుకున్న కార్మికుల తహతహ కూడా అదే. అది వాళ్ళ మనసులో తుఫానుగా మారింది. కట్టను తెంచుకొంటున్న జలగర్జనలా ప్రమాదం వాళ్ళను వెంబడిస్తోంది. సునామీ అలల్లా దూసుకొస్తోంది కాలువనీరు.

జలఖడ్గం విసురుకు కార్మికులు చెల్లాచెదురై పోయారు. లావా పొంగితే తట్టుకోలేని జీవాల్లా పొర్లాడసాగారు. గని గోడ బద్దలైంది. సర్వేయరు అంచనా తప్పింది. అతడు డైనమైట్‌తో పేల్చేయమన్న బొగ్గుగుట్టకు చేరువలోనే బొగ్గునిల్వలు తగ్గిపోవడంతో మూసేసిన గని ఉంది. దాన్నిండా నీళ్ళున్న విషయం సర్వేయరుకు తెలియదు. డైనమైట్ పేలుడుకు కాసేపట్లో దాని గోడ బీటలు వారింది. నీటి ఒత్తిడి ఎక్కువై కాసేపట్లో అది కూలిపోయింది. గండిపడ్డ చెరువులోంచి పొంగిపొర్లే జలధారలా, కోపంతో ఊగిపోతూ లంఘించే సింహసమూహంలా పెల్లుబికిన ప్రవాహం మంటినీ, మింటినీ ఏకం చేసింది. రక్తప్రవాహంలో కార్మికుల శరీరాలు మాంసశకలాలుగా తేలుతున్నాయి. కొండవాగు వెల్లువలో కొట్టుకుపోయే వృక్ష సమూహంలా, అడ్డూ అదుపూలేని నీటి వేగానికి తునాతునకలై పోతున్నాయి శరీరాలు.

విద్యుత్ నిచ్చెన పనిచేయలేదు. ప్రమాద ఘంటికలు మోగినా జాడలేని నిశ్చల స్థితి. నిచ్చెన గదిలోకి వచ్చిచేరినా వాళ్ళు ఏం చేయడానికీ పాలుపోక విలవిలలాడిపోతూ, గనిగోడలు అదిరిపోయేలా ఆక్రోశిస్తున్నారు. 'ఈ ఆక్రందనైనా పైనున్న వాళ్ళకు వినిపించదా!' రక్త ప్రవాహంలో అనుకుంటూ విలపిస్తున్నారు.

జలప్రవాహం నిచ్చెన గదిలోకి కూడా వచ్చేసింది. బలమైన లోహహస్తాలతో కొడుతున్నట్టు అక్కడున్న వాళ్ళందరినీ ఒక్క పెట్టునపడదోసి, నేలపై దొర్లించి, బంతిని కొట్టినట్టు పైకప్పుకేసి విసిరేసింది. చుంచెలుక ఇంట్లో ఓ గదిలోంచి మరో గదిలోకి పరుగెత్తినట్టు వెల్లువ ప్రతి గనినీ ముంచుతూ బయటకు రాలేని గాలి చేస్తోన్న ఎదురుదాడీ, పొంగి పొర్లుతోన్న నీటి ధాటీ

గనిని ఛిన్నాభిన్నాం చేస్తున్నాయి. ఆ ప్రాంతమంతా పిశాచులతో నిటలేక్షణుడు గజ్జె కదిలించి ఆడుతున్నట్టుగా ఉంది.

ఉగ్రరూపం దాల్చిన నీళ్ళు పిడుగులా, భూకంపంలా కరాళనృత్యం చేస్తోంది. ఎవరికీ లొంగని దెయ్యంలా ఎగిరెగిరి పడుతోంది. గాలగట్టును తెంచుకున్న నీళ్ళు ఇంతదాకా తనను అణచి పెట్టినందుకు ప్రతీకారం తీర్చుకుంటున్నట్టు పిడుగులా గర్జించింది. ఒక్కో గనినీ నింపుతూ క్రమంగా అంతటా ఆక్రమించి శాంతించింది.

పొయ్యిలో కట్టెపెట్టినట్టు గనిలో చిక్కుకున్న ప్రతి ఒక్కరినీ మృత్యుదేవత తన ఒడిలోకి చేర్చుకుంది. ఈ అమాయకుల్ని వదిలేయమని బతిమాలి, తన శక్తిమేరకు ఎదిరించి, చివరకు సొమ్మసిల్లింది. గనిలోపలి గాలి, మత్తగజంలాంటి నీటివెల్లువ గనిని అతలాకుతలం చేసింది. క్షణాల్లోనే కార్మికులంతా కుడితిలో పడ్డ ఎలుకల్లా గిలగిలా గింజుకొని చనిపోయారు. గనిమొత్తం నిశ్శబ్దంగా, నిశ్చలంగా, రుద్రభూమిలా మారిపోయింది. బీటలు వారిన గోడల్లోంచీ బొగ్గుముక్కలో, మట్టిపెళ్ళలో రాలే చప్పుడు మాత్రం అప్పుడప్పుడూ సన్నగా వినిపిస్తోంది.

గనిలోపల చిక్కుకున్న మూడువందల మందినీ పొట్టన పెట్టుకొంది వెల్లువ. ప్రతిరోజూ శ్రమదోపిడీకి గురవుతూ, కొద్దికొద్దిగా మరణిస్తోన్న కార్మికుల ప్రాణాలు కొద్దిక్షణాల్లోనే మూకుమ్మడిగా అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

✠ ✠ ✠

మిట్ట మధ్యాహ్నం వేళ ప్రమాదఘంటిక అదేపనిగా మోగుతోంది. కార్మికుల క్వార్టర్సుల్లో భయమూ, దిగ్భ్రాంతీ పోటెత్తాయి. ఏం జరిగింది? ఎవరికైనా ప్రమాదం జరిగిందా? దురదృష్టవంతులు ఎవరో? ఏ కుటుంబం నెత్తిన పిడుగు పడబోతుందో? ఏ స్త్రీ తన భర్తను కోల్పోతుందో? ఏ బిడ్డలకు తండ్రినీడ కరువవనుందో? ఏ తల్లిదండ్రుల కడుపులో రాయి పడుతుందో? తలా ఒక విధంగా భయపడుతున్నారు. ప్రతి మనసూ కీడు శంకిస్తోంది. ప్రతి హృదయంలోనూ అపశ్రుతి.

నడవలేని వాళ్ళు తప్ప తక్కిన అందరూ గాల్లో ఎగిరే దూదిపింజల్లా గనికేసి పరుగుదీశారు. గని పై భాగంలో యంత్రాలన్నీ చడీ, చప్పుడూ చేయకుండా నిశ్చలంగా పడున్నాయి. పై భాగంలో పనిచేసే వాళ్ళందరూ దెయ్యం దెబ్బకు జడుసుకున్నట్టు స్థాణువుల్లా నిల్చున్నారు. అలలు విశ్రమించిన సముద్రంలా అంతటా ప్రశాంతత. అయితే, పోటెత్తిన వెల్లువలా సుళ్ళు తిరిగే భీతి! పొంగి పొర్లే గోదావరిలా పెల్లుబుకుతోన్న కన్నీళ్ళు! హృదయాన్ని కుంగదీస్తోన్న దుఃఖభారం.

అంతా అర్థమైపోయింది. విద్యుత్ నిచ్చెన మొరాయించింది. గనిలోకి వెళ్లిన వాళ్లెవరూ తిరిగిరాలేదు. గోడ కూలిపోయింది. వెల్లువ గనిని ముంచెత్తింది. చచ్చిన చేపల్లా నిర్జీవదేహాలే తేలుతూ ఉండొచ్చు. ప్రాణాలు కాపాడుకోవడం కోసం పోరాడుతున్నప్పుడు ఆ నిస్సహాయులు ఎంతగా విలపించారో! దైవాన్ని ఎంతగా అర్థించారో! వాళ్ళు తమ భవిష్యత్తు గురించి కన్న కలలన్నీ పేకమేడలై కూలిపోయాయి కదా! వాళ్ళ ఆశలూ, ఆశయాలూ కరిగిపోయాయి కదా! భర్తల్ని కోల్పోయిన మహిళల ఆక్రందనలు, తండ్రుల్ని కోల్పోయిన పిల్లల ఆర్తనాదాలు హృదయవిదారకంగా ఉన్నాయి. స్వయంగా నేలతల్లి నోరుతెరిచి విలపించినట్టు కట్టలు తెంచుకున్న ఆత్మీయతా బంధం. సుడిగాలిలా రేగిన భావావేశం. వాళ్ళతో కలిసి జీవించిన రోజులనాటి జ్ఞాపకాలు మసక బారుతున్నాయి. వాళ్ళతో చెప్పుకున్న ఊసులు చెదిరిపోసాగాయి. జీవనాధారం వట్టిపోయిన బాధ. గుదిబండలాంటి కుటుంబభారం పైకి లేవకుండా అణగదొక్కుతున్న భావన. పీకిపారేసిన కూరమొక్కలా, ప్రేమ, వాత్సల్యం, బాధ్యత, భద్రత, బలం ఇలా అన్నీ అదృశ్యమైనట్టు అందరి అంతరంగాలూ పొడిగా ఉన్నాయి.

దిగ్భ్రాంతిని తట్టుకోలేని ఒకరిద్దరు గుండెపోటుతో అక్కడికక్కడే మరణించారు. మరికొందరు స్పృహ తప్పారు. భూమ్యాకాశాలు దద్దరిల్లేలా, ఒకటే ఏడుపు. పక్షులూ, జంతువులూ భయంతో గూళ్ళకేసీ, పొదలకేసీ పారిపోతున్న విచిత్ర దృశ్యం. పెంపుడు కుక్కలు యజమానురాళ్ళ మొగాలకేసి చూసి, ఓదార్చుతున్నట్టుగా కాళ్ళతో మెల్లగా నిమురుతున్నాయి. సన్నగా మూలుగుతూ తమ దుఃఖాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

ఇక లోపల దిగడానికి ఏ మాత్రమూ ఆస్కారం లేదు. తెగించి ఎవరైనా దిగినా, తిరిగి వస్తారన్న నమ్మకం లేదు. గని అధికారులు సమావేశమై మంతనాలు జరిపారు. పెద్దపెద్ద యంత్రాల సహాయంతో నీళ్ళు తోడాలనీ, అదొకటే సమస్యకు పరిష్కారమనీ నిర్ణయించి, తమ నిర్ణయాన్ని తక్షణం అమలుచేశారు.

సమ్మె తాలూకు ముందస్తు ఏర్పాట్లు చేసే సన్నాహక సమితి సమావేశానికి వెళ్లిన బికాస్ చౌదరికి కబురందింది. నాయకులందరూ వచ్చిచేరారు. వేల సంఖ్యలో జనం గుమిగూడారు. తమను తాము మరిచిపోయి ఆవేశంతోనూ, ఉద్వేగంతోనూ గొంతెత్తి అరవసాగారు. కనీ, వినీ ఎరుగని దుర్ఘటన అక్కడికి వచ్చి చేరిన బికాస్‌కు దిగ్భ్రాంతిని కలిగించింది. దుఃఖం ఎగదన్నుకు వచ్చింది. ఓదార్చలేనంతగా మొద్దుబారిపోయింది మనసు. మళ్ళీ మామూలు మనిషి కావడానికి కొంతసేపు పట్టింది. ఎవర్ని ఓదార్చాలి? ఎవరికి ధైర్యం చెప్పాలి? అది అయ్యే పనేనా! ప్రాణానికి ఏ షరాబూ ఖరీదు కట్టలేదు. ఆ దుఃఖాన్ని ఎవరూ అర్థం చేసుకోలేరు. ఆత్మీయులకు మాత్రమే అనుభవంలోకి వస్తుందది. అది కలిగించే దుఃఖం, రగిలించే వేదన సంబంధీకులకు మాత్రమే తెలుస్తుంది. ఇతరులు చెప్పే ఓదార్పు మాటలూ, ప్రకటించే సానుభూతీ మానసిక శాంతి కలిగించడానికి లాంఛనప్రాయంగా చేసే చర్యలే. దాని వల్ల ఆరేదీ, తీరేదీ కాదని, ప్రతి ఒక్కరికీ తెలిసిందే.

బికాస్ అధికారుల్ని కలిసి మాట్లాడాడు. ఆ షిఫ్టుకు పనిలోకి మూడువందల మంది వచ్చారని నిర్ధారించుకున్నాడు. వాళ్ళ గతి ఏమిటో ఆయా కుటుంబాలకు తెలియజేయాల్సి ఉంది. ఒక్కో కుటుంబమూ ఆశగా నిరీక్షిస్తోంది. తమ వాళ్ళు గనిలో ఎక్కడో ఒక మిట్టపై నిలుచుని ఉండొచ్చు. పీకలలోతు నీళ్ళలో ఏదో గోడ ఆసరాగా నిలుచుకొని ఉండొచ్చు. చూరును పట్టుకొని వేలాడుతుండొచ్చు. ఈదుతూ ఉండొచ్చు. మొరాయించిన నిచ్చెన గనుక పనిచేయడం మొదలెడితే వాళ్ళను కాపాడవచ్చు. చీలికలోంచి వెలువడిన నీళ్ళకు బహుశా గనిని పూర్తిగా ముంచేసేంత ధాటి ఉండకపోవచ్చు. గనిలో చిక్కుకున్న వాళ్ళు ఎలాగోలా క్షేమంగా బయట పడతారు. నల్లదేవత దుర్గాదేవి నల్లవాళ్ళను గాలికి వదిలేయదు. ఆమె సృష్టించిన నల్ల బంగారాన్ని తవ్వితీసి ప్రపంచాన్ని సుసంపన్నం చేస్తారు కదా! వాళ్ళంత తేలికగా మృత్యువు బారిన పడతారా? గుమిగూడిన జనం మనసులో నమ్మకం గూడు కట్టుకుంది.

రాక్షస యంత్రాలను త్వరగా అక్కడికి తరలించారు. లోపల్నుంచి తోడి పోస్తోన్న నీళ్ళు జలపాతాన్ని తలపింపజేస్తున్నాయి. మరోపక్క అక్కడ గుమిగూడిన జనం కోసం పందిళ్ళు వేశారు. తిండి పొట్లాలు అందజేశారు. ఏమీ తినకపోయినా ఆకలేయని స్థితి. పిల్లల కోసమే తీసుకున్నారు జనాలు. పిల్లలకు గేయాలే తప్ప గాయాలు తెలియవు.

ఒకరోజు, రెండు రోజులు... ఇలా రోజులు దొర్లిపోతున్నాయి. నిరంతరంగా నీళ్ళు తోడిపోస్తున్నారు. గని లోపలి భాగంలో ఉన్న నీటిని బయటికి పంపించి, ఆ స్థలాన్నంతా ఖాళీ చేయడం కోసం యంత్ర భూతాలు నీటిని పీల్చేసుకుంటున్నాయి. క్రమంగా నీళ్ళు తగ్గిపోవడం తెలుస్తూనే ఉంది. ఎలాగైనా సరే, నీటిని పూర్తిగా బయటికి పంపించడం సాధ్యమేనన్న నమ్మకం మొగ్గ తొడిగింది. అయితే గనికే తమ జీవితాలను అంకితం చేసుకున్న అభాగ్యుల గతి... డోలాయమాన పరిస్థితి... మూడు రోజులుగా నీళ్ళు తోడే పని సాగుతూనే ఉంది. బాధిత కుటుంబాలకు ఆకలి కూడా తెలియడం లేదు, ఆందోళన తప్ప. పసిబిడ్డలు, పెళ్లీడుపిల్లలు, వృద్ధులు...ఇలా ఆధారపడి బతుకుతున్న వాళ్ళెందరో! వాళ్ళంతా రుచీ, శుచీ అంటూ పట్టించుకోకుండా నిరాసక్తంగా కడుపుకింత పడేసి, కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు.

(ఇంకావుంది)



చేసేద్దాం

అడవిపంది కావాలా!

హాయ్ నేస్తాలూ! మీరెప్పుడైనా అడవిపందిని చూశారా! లేదా? అందుకే మీకోసం తీసుకొచ్చాం. చూడండి మరి. దాన్ని మేం చేత్తో తయారుచేశాం. పెద్ద కష్టమేం కాదు. మీరు కూడా చేసేయొచ్చు. ఈవారం ఇదే చెప్పకుందాం. అన్నట్టు అడవి పంది గురించి మీకో విషయం చెప్పాలి. ఇది శత్రువుల బారినుంచి తనను రక్షించుకోగలదు. ఎలాగంటే...దాని శరీరమంతా ముళ్లుంటాయికదా. వాటి సాయంతో అన్నమాట. అలాంటి ముళ్లపందిని తయారుచేయడానికి ఏమేం కావాలో ఎలా చేయాలో చూద్దాం.

<u>*కావాల్సిన వస్తువులు:*</u>

ఆలుగడ్డ, టూత్‌పిక్స్, గమ్, చీపురు పుల్లలు, రబ్బరు బ్యాండ్లు.

<u>*తయారు చేసే విధానం:*</u>

ఎనిమిది టూత్‌పిక్కు తీసుకుని వాటిని సగానికి విరవండి. నాలుగేసి పుల్లలను కలిపి వాటి చివర ఒక రబ్బరు బ్యాండు పెట్టి ఉంచండి. ఇప్పుడు వాటిని కాళ్లలాగా ఆలుగడ్డకు గుచ్చుకోవాలి. దానిమీద స్కెచ్ పెన్నుతో మొహం గీసుకోవాలి. టూత్‌పిక్స్‌తో ఆలుగడ్డకి రంధ్రాలు పెట్టి వాటిలో సన్నని చీపురు పుల్లలు గుచ్చాలి. అంతే! ముళ్ల పంది రెడీ. ఎంచక్కా దీన్ని షోకేస్‌లో పెట్టొచ్చు. లేదా హాల్లో టేబుల్ మీద పెట్టొచ్చు. అందరూ దీన్ని చూసి తెగ మెచ్చుకుంటారు 'ఎవరు చేశారబ్బా' అని. మరి చేసేస్తారుగా.

స్కేటింగ్ సిసింద్రీ

హలో చిన్నారులూ...! ఈ పిడుగును చూశారా! కారు కింది నుంచి స్కేటింగ్ చేస్తున్నాడు!! ఎంత కష్టమో కదా అలా చేయడం. ఇవాళ మనం ఆ పిడుగు గురించే చెప్పకోబోతున్నాం. ఇంతకీ తన పేరేంటంటే...రోహన్ అజిత్. వీళ్లది కర్నాటకలోని బెల్గాం. ఇంతకీ వీడి ప్రత్యేకత ఏంటంటే... త్వరలో గిన్నిస్‌బుక్, లింకా బుక్ లోనూ ఎక్కబోతున్నాడు. ఫొటో చూశారుగా! ఎన్ని ట్రోఫీలు? ఎన్నెన్ని అవార్డులు? ఇన్ని బహుమతులు గెలుచుకుని ప్రపంచ రికార్డుల్లోకెక్కబోతున్న అజిత్‌కి ఎన్ని సంవత్సరాలో తెలుసా? తొమ్మిది సంవత్సరాలు. సెయింట్ గ్జావియర్ హైస్కూల్లో మూడోతరగతి చదువుతున్నాడు. మరి ఇంత చిన్న వయసులోనే అంత పేరు, అన్ని రికార్డులు ఎలా సాధించాడంటే స్కేటింగ్ చేస్తూ కార్ల కింది నుంచి దూరడం ద్వారా. ఈ మధ్యే అలా స్కేటింగ్ చేస్తూ మూడు కార్లకింది నుండి దూరాడు. చూసిన వారంతా ఆశ్చర్యపోయారనుకోండి. పక్కనున్న ఫోటోలో మీరూ ఆ అద్భుతాన్ని చూడొచ్చు. నిజమే మరి అంత చిన్న వయసులో కార్ల కిందినుండి స్కేటింగ్ చేస్తూ దూరడం అంటే మాటలా? అదీ కళ్లకు గంతలు కట్టుకుని! ఇలా ముందుకూ(5.7 అంగుళాల ఎత్తులో), వెనుకకూ(6.5 అంగుళాల ఎత్తులో) స్కేటింగ్ చేయగలడు. రెండున్నర సంవత్సరాల నుండి ఈ విధంగా సాధన చేస్తున్నాడు. మరిన్ని రికార్డులు సృష్టించాలన్న పట్టుదలతో రోజుకు నాలుగు గంటలపాటు ప్రాక్టీస్ చేస్తున్నాడు.



ఇంతకీ ఈ స్కేటింగ్ పట్ల అజిత్‌కి ఆసక్తి ఎలా కలిగిందో చెప్తే మీరంతా ఆశ్చర్యపోతారు తెల్సా. ఓరోజు ఒక అబ్బాయి స్కేటింగ్ ప్రదర్శన ఇవ్వడం చూశాడు అజిత్. అప్పటినుంచి వాడి మనసు నిండా స్కేటింగ్ చక్రాలే నిండిపోయాయి. వాళ్ల నాన్నని రోలర్ స్కేట్ కొనివ్వమని అడిగేశాడు కూడా. కొద్దిరోజులపాటు ఇంట్లో ప్రాక్టీస్ చేసిన తర్వాత స్థానిక కోచ్ సూర్యకాంత్ దగ్గర శిక్షణ పొందాడు. అయితే అజిత్ దగ్గర వున్న టాలెంట్‌ను కోచ్ గుర్తించి ప్రోత్సహించాడు. ఆయన దగ్గర వున్న 200 మంది విద్యార్థులలోనూ మాస్టారు చెప్పింది ఇట్టే పట్టేస్తాడు. అందుకే అంత గుర్తింపు వచ్చింది మరి. మరో తమాషా ఏంటంటే... ఈ అజిత్ స్కేటింగ్ చేయడం మొదలెట్టిన కొత్తలో... వాడికి ఎక్కడ దెబ్బలు తగులుతాయోనని .... వాళ్ల అమ్మానాన్నా చాలా భయపడ్డారు. ఓసారి వాడి వీపు మీద దెబ్బ కూడా తగిలిందిలెండి. అందుకే అంత భయం. అయితే తర్వాత్తర్వాత ఆ పిడుగు సామర్థ్యమూ, చేస్తున్న కష్టమూ చూసి అలాంటి భయాలన్నీ వదిలేశారు వాళ్లు. అయితే పాపం వాళ్లది పేద కుటుంబం. దాంతో వాడు మరింత అభివృద్ధి చెందడానికి అవసరమైన ఏర్పాట్లు చేయలేకపోతున్నానని అజిత్ తండ్రికి కాస్త బాధ. అంతేకాదర్రా! ఈ చిచ్చరపిడుగు ఒలంపిక్స్‌లో పాల్గొని దేశానికి పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టాలని కూడా ఆశ. చివర్లో అజిత్ గురించి ఓ విషయం చెప్పాలర్రా! అదేంటంటే... వీడు చూస్తే పసి పిల్లాడు కదా. కానీ సంఘసేవ కూడా చేస్తుంటాడు. ఎలాగంటారా! బాల కార్మికులు, ప్రాణాంతక ఎయిడ్స్ వ్యాధికి సంబంధించిన చైతన్యాన్ని కలిగించడానికి స్థానికంగా స్కేటింగ్ ప్రదర్శనలిస్తుంటాడు. గ్రేట్ కదా!

రాసేద్దామా!

పిడుగులూ... ఇక్కడ మీకు కొన్ని వాక్యాలు కనిపిస్తున్నాయా? వాటి పక్కనే పూర్తిచేయాల్సిన ఖాళీలు కూడా ఉన్నాయి. మీరేం చేయాలంటే పైన poor వుందికదా. దానిని బట్టి మీరు కింద ఇచ్చిన వాక్యాలకు తగిన పదాలు రాయాలి. అయితే ఇక్కడ ఒక తమాషా వుంది . మీరు రాసే ప్రతి పదంలోను ఒక అక్షరం మాత్రమే మారుతూ వుంటుంది.

POOR

A small body of water ______

A silly person ______

Lowest part of the leg ______

Part of the plant ______

A bird ______

A large stone ______

A stack of ha ______

RICH

జవాబు: pool, fool, foot, root, rook, rock, rick.

సరిచేస్తేపోలా...

చిన్నారులూ...ఇక్కడో అందమైన పువ్వు వుందా. దానికిందే అలాంటి పువ్వునే ముక్కలు ముక్కలుగా చేసేశారు. వాటన్నింటిని ఎలా పెడ్తే సరిగ్గా పువ్వులా వస్తుందో తెల్సు కదా. త్వరగా కానీయండి మరి.



వేలిముద్ర శునకం

హాయ్ చిన్నారులూ...
ఇదిగో ఈ వారం మీకోసం వెరైటీ జంతువును తీసుకొచ్చాం. చూశారుగా. కుక్కపిల్ల వుందిక్కడ. ఇది మనకు బాగా తెలిసినది కదా. ఇంక వెరైటీ ఏముంది? అనుకుంటున్నారుకదూ. అదిగో అక్కడే పప్పులో కాలేశారు మీరు. దీన్ని మన వేలిముద్రతో వేశాం. కావాలంటే మీరు కూడా వేయొచ్చు. ఎలాగో చెప్పమంటారా? ముందు ఇంక్‌ప్యాడ్, మార్కర్, పేపర్ తీసుకోండి. మీ బొటన వేలిని ఇంక్ ప్యాడ్ మీద పెట్టి బాగా ఒత్తండి. తర్వాత తెల్ల కాగితం మీద వేలిని ఒత్తండి. మీ వేలి ముద్ర పడుతుంది. ఆ ఇంక్ బాగా ఆరేవరకు వదిలిపెట్టండి. దానికి మనకు కావాల్సిన జంతువు ఆకారంలో కాళ్లు, చేతులు, మూతి, చెవులు లాంటివి గీసుకోవాలి. అంతే ఆ బొమ్మ రెడీ అయిపోతుంది. ఈవారానికి కుక్క బొమ్మ వేసేయండి. వచ్చే వారం పిల్లి బొమ్మ చేయడం ఎలాగో చెప్పకుందాం. మరి ఎదురుచూస్తుంటారుగా.

ఆ రెండూ ఏవి?

ఫ్రెండ్స్! ఈ గుడ్డు చూడండి. ఎన్ని ముక్కలుగా పగిలిపోయివుందో. ఈ పగిలిన ముక్కల్లో ఒక్కొక్కటి ఒక్కోలా వుంది. కానీ రెండు ముక్కలు మాత్రం ఒకేలా వున్నాయి. అవేంటో చెప్పండి.



జవాబు: 9, 20

సంతకం





అబితాబ్ బచన్

తెల్సా!



ఒక వ్యక్తి ఎనిమిది సంవత్సరాల ఏడు నెలల ఆరు రోజులు గట్టిగా అరిస్తే విడుదలయ్యే ధ్వని శక్తితో ఎంచక్కా ఒక కప్పు కాఫీ వేడిచేసుకోవచ్చు.

అట్టమీది కథ



వెంకట్రామన్ రామకృష్ణన్

ప్రతిభకు పట్టాభిషేకం

-ఎస్.వెంకట్రావు

శాస్త్ర విజ్ఞాన రంగంలో 2009 నోబుల్ బహుమతులు అనేక విశిష్టతలు సంతరించుకున్నాయి. భారతీయ సంతతికి చెందిన అమెరికన్ శాస్త్రవేత్త వెంకట్రామన్ రామకృష్ణన్ రసాయనిక శాస్త్రంలో మరోఇద్దరితో కలిసి నోబుల్ బహుమతిని గెలుచుకోవడం మనకు, అంటే భారతీయులకు సంబంధించిన విశేషం. ఈసారి భౌతిక శాస్త్రం, రసాయనిక శాస్త్రం, వైద్య శాస్త్రం....ఈ మూడింటిలోనూ నోబుల్ బహుమతులను ముగ్గురేసి శాస్త్రవేత్తలు పంచుకోవడం రెండో విశేషం. పురుషులతో పోటాపోటీగా మహిళా శాస్త్రవేత్తలు నోబుల్ బహుమతులు గెలుచుకోవడం మూడో విశేషం. విజ్ఞాన శాస్త్ర రంగంలో మొత్తం తొమ్మిదిమందికి బహుమతి రాగా వారిలో ముగ్గురు మహిళా శాస్త్రవేత్తలు. ఈ ఏడాది సాహిత్యంలో నోబుల్ బహుమతి రుమేనియాలో పెరిగిన జర్మన్ రచయిత్రికీ, ఆర్థిక రంగంలో నోబుల్ బహుమతి అమెరికాకు చెందిన మహిళా ఆర్థికవేత్తకూ వచ్చాయి. వీరితో కలుపుకుంటే అయిదుగురు మహిళలు నోబుల్ బహుమతులు గెలుచుకున్నారు. నిజానికి రసాయనిక శాస్త్రం, వైద్యశాస్త్రాల్లో నోబుల్ బహుమతులు అందుకున్న మహిళా శాస్త్రవేత్తలు ఆ రంగాల్లో మార్గదర్శక పరిశోధనలు చేసి పైచేయి సాధించారు.

ఆడా ఇ. యోనాథ్



థామస్ ఎ. స్టీట్జ్

వెంకట్రామన్ రామకృష్ణన్

2009 నోబుల్ బహుమతి పొందిన వెంకట్రామన్ రామకృష్ణన్ ఈ అత్యుత్తమ బహుమతి పొందిన భారత సంతతి వ్యక్తుల్లో ఏడవ వాడు. గతంలో ముగ్గురు భారతీయులు, నలుగురు భారతీయ సంతతికి చెందిన వారు నోబుల్ బహుమతులు అందుకున్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్యంలోనూ (1913), సివి రామన్ భౌతిక శాస్త్రంలోనూ (1930) నోబుల్ బహుమతులు అందుకోగా పేదజనోద్ధరణకు గాను మదర్ థెరిసాకు నోబుల్ శాంతి బహుమతి (1979) లభించింది. మదర్ థెరిస్సా యుగోస్లావియాలో జన్మించినప్పటికీ తన కృషిని ప్రధానంగా భారత దేశంలోనే జరిపారు. వీరుగాక భారత సంతతికి చెందిన హర్‌గోవింద ఖొరానా (1968-వైద్యం), సుబ్రమణ్య చంద్రశేఖర్ (1983-భౌతిక శాస్త్రం), అమర్త్య సేన్ (1998-ఆర్థిక శాస్త్రం), వి.ఎస్. నైపాల్ (2001-సాహిత్యం) నోబుల్ బహుమతులు అందుకున్నారు. సరికొత్తగా వెంకట్రామన్ రామకృష్ణన్ వీరి వరసలో చేరారు.

57 ఏళ్ల వెంకట్రామన్ రామకృష్ణన్ అమెరికాలో స్థిరపడినప్పటికీ ఆయన పుట్టి పెరిగింది భారత్‌లోనే. తమిళనాడులోని చిదంబరంలో ఆయన 1952లో జన్మించారు. ఆయన తల్లితండ్రులిద్దరూ శాస్త్రవేత్తలే. 1971లో బరోడాలోని ఎం.ఎస్. విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్రంలో బి.ఎస్‌సి పట్టా పుచ్చుకున్న రామకృష్ణన్ అక్కడినుండి ఉన్నత చదువులకోసం అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడిపోయారు. అమెరికా పౌరసత్వం స్వీకరించారు. ఓహియో విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్రంలో పి.హెచ్‌డి చేశారు. తదుపరి కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో 1976 నుండి 78 వరకు గ్రాడ్యుయేట్ విద్యార్థిగా పనిచేశారు. ఈ కాలంలోనే ఆయన భౌతిక శాస్త్రం నుండి జీవ శాస్త్ర పరిశోధనకు మారారు. ఈ విధంగా భౌతిక శాస్త్రం నుండి జీవశాస్త్ర పరిశోధనలోకి ఒక్కసారిగా మారడం చాలా అరుదైన విషయం. యాలే విశ్వవిద్యాలయంలో ఆయన 'ఈ కోలి' బాక్టీరియా కణాల్లోని

రైబోజోమ్ అనే కణాంగాల న్యూట్రాన్-స్కాటరింగ్ మ్యాప్‌పై పరిశోధన చేశారు. అప్పటినుండి ఆయన రైబోజోమ్ నిర్మాణంపై పరిశోధన కొనసాగిస్తూ వచ్చారు. ఈ పరిశోధనల ఫలితంగానే ఆయనకు 2009 నోబుల్ బహుమతి లభించింది. విశేషమేమంటే ఆయన చదివింది భౌతిక శాస్త్రం, మధ్యలో చేపట్టింది జీవశాస్త్రం కాని నోబుల్ బహుమతి లభించింది రసాయన శాస్త్రంలో. తన భౌతిక శాస్త్ర పరిజ్ఞానమే మౌలికంగా తనకీ బహుమతి రావడానికి తోడ్పడిందని రామకృష్ణన్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. నోబుల్ బహుమతి పొందేనాటికి రామకృష్ణన్ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలోని మెడికల్ రిసెర్చ్ సెంటర్ (ఎంఆర్‌సి) మాలిక్యులార్ బయాలజీ లేబరేటరీలో సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు.

కొత్తరకాల యాంటీబయాటిక్స్ ఉత్పత్తికి తోడ్పడే పరిశోధన

రామకృష్ణన్ నోబుల్ బహుమతిని మరో ఇద్దరితో కలిసి పంచుకున్నారు. వారిలో ఇజ్రాయిల్‌కు చెందిన మహిళా శాస్త్రవేత్త ఆడా ఇ. యోనాథ్, అమెరికాకు చెందిన థామస్ ఎ. స్టీట్జ్ ఉన్నారు. జీవులు శరీర కణాల్లోని రైబోజోమ్‌లు అనే కణాంగాల అణు నిర్మాణాన్ని కనుగొన్నందుకుగాను వీరికి ఈ బహుమతి లభించింది. ఈ ముగ్గురిలో ఆడా యోనాథ్ ఈ పరిశోధనలో ముందున్నారు. 1970వ దశకంలోనే ఆమె ఎక్స్-రే క్రిస్టల్లోగ్రఫీ అనే పద్ధతిద్వారా రైబోజోమ్‌ల నిర్మాణ చిత్రాన్ని తయారుచేయడానికి ప్రయత్నించారు. రైబోజోమ్‌లో ఏఏ అణువులు ఖచ్చితంగా ఏ ప్రాంతంలో ఉన్నాయో తెలుసుకోవాలన్నది ఆమె ఉద్దేశ్యం. అదే చేయగలిగితే మానవజాతికి పెద్ద మేలు జరుగుతుంది. ఎందుకంటే రైబోజోమ్‌లు అనేవి జీవి శరీరంలోని మాంసకృత్తుల (ప్రోటీనుల) ఉత్పత్తి కేంద్రాలు. ఈ కేంద్రాలుగనుక పనిచేయకపోతే జీవజాలం నాశనమైపోతుంది. సరిగ్గా ఈ విషయాన్నే ఉపయోగించుకుని యాంటీబయాటిక్ మందులు ఉత్పత్తి చేస్తున్నారు. మన శరీరంపై దాడిచేసే వివిధ రకాల బాక్టీరియాలపై యాంటీబయాటిక్ మందులు దాడిచేసి వాటిలోని రైబోజోమ్‌లు పనిచేయకుండా ఆపేస్తాయి. అంటే బాక్టీరియాలోని ప్రోటీను ఉత్పత్తి ఫ్యాక్టరీలను యాంటీబయాటిక్ మందులు ధ్వంసం చేస్తాయన్న మాటం. దాంతో బాక్టీరియాలు క్షీణించి నాశనమవుతాయి. అయితే బాక్టీరియాలు తరచు యాంటీబయాటిక్ మందులకు రెసిస్టెన్స్ పెంచుకుంటాయి. అంటే యాంటీబయాటిక్ మందుల్లు ఒక పద్ధతిలో రైబోజోమ్‌ల్లోని ప్రోటీనుల ఉత్పత్తిని అడ్డుకుంటే మరో పద్ధతిలో ఉత్పత్తిని ప్రారంభిస్తాయి. దాంతో మందులు పనిచేయవు. అప్పుడు కొత్త పద్ధతిలో రైబోజోమ్‌లోని ఉత్పత్తిని ఆపడానికి కొత్త యాంటీబయాటిక్‌లు ఉత్పత్తి చేయాల్సి వస్తుంది. రైబోజోమ్ అణునిర్మాణాన్ని గనుక పూర్తిగా తెలుసుకుంటే అప్పుడు రెసిస్టెన్స్‌ను తట్టుకునే కొత్తకొత్త యాంటీబయాటిక్స్‌ను అనేక సంఖ్యలో తయారుచేయడానికి మార్గం సుగమమవుతుంది. ఇది మానవాళికి ఎంతో మేలుచేస్తుందనడంతో సందేహం లేదు. దీనికోసమే 'యోనాథ్' ఎక్స్-రే క్రిష్టల్లోగ్రఫీ పద్ధతిని ఉపయోగించుకోదలచుకున్నారు. కాని రైబోజోమ్‌ల స్వచ్ఛమైన స్ఫటికాలు (క్రిస్టల్స్) తయారుచేయడం ఆమెకు చాలా కష్టమైన పనిగా తోచింది. 20 ఏళ్లపాటు ఆమె పరిశోధన చేసిన తరువాత ఎక్స్-రే క్రిస్టల్లోగ్రఫీ ద్వారా రైబోజోమ్‌లోని ప్రోటీనుకణాల నిర్మాణ చిత్రాన్ని రూపొందించగలిగారు. ఈ నిర్మాణ రూపాన్ని తరయారు చేయడంలో డాక్టర్ స్టీట్జ్, డాక్టర్ రామకృష్ణన్‌లు చేసిన పరిశోధనా ఫలితాలు ఎంతగానో తోడ్పడ్డాయి. దాంతో నోబుల్ బహుమతిని ఏటేటా ఆ బహుమతి ఇచ్చే స్వీడిష్ కమిటీ ఈ ముగ్గురికీ కలిపి ప్రకటించింది. అంతగొప్ప పరిశోధన చేసి మానవాళికి అంతగొప్ప మేలు చేకూర్చిన ఈ ముగ్గురు శాస్త్రవేత్తలకూ అంత గొప్ప బహుమతి రావడం సముచితమే కదా!

క్యాన్సర్‌పై యుద్ధంలో ముందడుగు

ఈ ఏడాది వైద్యశాస్త్రంలో నోబుల్ బహుమతి గెలుచుకున్న ముగ్గురు అమెరికన్ శాస్త్రవేత్తల్లో ఇద్దరు మహిళలు కావడం విశేషం. వీరిలో డాక్టర్ ఎలిజబెత్ బ్లాక్‌బర్న్ కాలిఫోర్నియా యూనివర్శిటీకి డాక్టర్ కరోల్ గ్రీడర్ బాల్టిమోర్‌లోని జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయ వైద్య విభాగానికి చెందినవారు. ఈ మహిళలతోపాటు బోస్టన్‌లోని మసాచుసెట్స్ జనరల్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ జాక్ జోస్టాక్ ఈ బహుమతిని పంచుకున్నారు.

వీరి పరిశోధన కూడా రసాయన శాస్త్ర పరిశోధనలాగే వైద్యరంగంలో కొత్త మందుల తయారీకి దారితీస్తుంది. జీవకణాల్లో అనువంశిక లక్షణాలు నిర్ణయించే క్రోమోజోముల్లో డిఎన్ఎ గొలుసు చివరి భాగాల నిర్మాణానికి సంబంధించిన రహస్యాన్ని ఈ శాస్త్రవేత్తలు ఛేదించారు. క్రోమోజోములు విభజన పొందడం ద్వారా అనువంశిక లక్షణాలు తల్లిజీవినుండి పిల్లజీవికి సంక్రమిస్తాయి. అయితే ఈ క్రోమోజోముల్లోని డిఎన్ఎ గొలుసు చెదిరిపోకుండా గొలుసు చివరల్లోని డిఎన్ఎ యొక్క ప్రత్యేక నిర్మాణం కాపాడుతుంది. డిఎన్ఎ నిర్మాణం అంతా ఒక మాదిరిగా ఉంటే దాని చివర్లలోని నిర్మాణం మరోరకంగా ఉంటుంది. ఈ చివరి నిర్మాణాలను టెలోమెరెస్ అంటారు. టెలోమెరెస్ నిర్మాణానికి టెలోమెరాస్ అనే ఎంజైమ్ తోడ్పడుతుంది. మామూలు కణాల్లో టెలోమెరెస్ సాధారణంగా ఉంటుంది. కాబట్టి కణాలు మామూలుగా పెరుగుతాయి. కాని టెలోమెరెస్ పొడవు తక్కువగా ఉన్న కణాల పెరుగుదల


కరోల్ గ్రీడర్

ఎలిజబెత్ బ్లాక్‌బర్న్


విల్లార్డ్ బోయిలే


చార్లెస్ కె. కావో

జార్జి స్మిత్

తగ్గిపోతుంది. ఇవి పొడవుగా ఉంటే కణాలు విపరీతంగా పెరిగి క్యాన్సర్‌కు దారితీస్తుంది. అందువల్ల క్యాన్సర్‌తో బాటు అనేక రకాల అనువంశిక జబ్బులకు ఈ టెలోమెరెస్ కారణమని నోబుల్ బహుమతి పొందిన ముగ్గురు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. టెలోమెరెస్ ఉత్పత్తికి తోడ్పడేది టెలోమెరాస్ ఎంజైమ్ అని కనుగొన్నారు. వీరు కనుగొన్న ఆవిష్కరణ భవిష్యత్తులో క్యాన్సర్ వంటి జబ్బులను అర్థం చేసుకుని నివారించడానికి తోడ్పడుతుందనడంలో సందేహం లేదు.

కాంతిని ఒడిసిపట్టి ప్రపంచమంతా పంపిస్తున్నందుకు

భౌతికశాస్త్రంలో ఈ ఏడాది నోబుల్ బహుమతి పొందిన ముగ్గురు శాస్త్రవేత్తల పరిశోధనలు నేడు మన జీవితంలో ఎనలేని ప్రభావాన్ని కలుగజేశాయి, భవిష్యత్తులో కూడా ప్రభావం కలుగజేస్తాయి. విస్తారమైన సమాచారాన్ని కాంతిరూపంలో బంధించి ప్రపంచమంతటికీ ప్రసారం చేసే ఫైబర్ ఆప్టిక్స్‌ను కనుగొన్న చైనా శాస్త్రవేత్త చార్లెస్ కె. కావో, డిజిటల్ ఫోటోలను కనుగొన్న అమెరికన్ శాస్త్రవేత్తలు విల్లార్డ్ బోయిలే, జార్జి స్మిత్‌లకు సంయుక్తంగా ఈ ఏడాది భౌతికశాస్త్ర నోబుల్ బహుమతి లభించింది. చైనా వాణిజ్య రాజధాని షాంఘైలో జన్మించి బ్రిటన్‌లోని స్టాండర్డ్ టెలికమ్యూనికేషన్స్ లేబరేటరీలో పరిశోధనచేసి ప్రస్తుతం హాంగ్ కాంగ్‌లో స్థిరపడిన కావో 1960ల లోనే కాంతిని దూరప్రాంత కమ్యూనికేషన్స్ కోసం ఉపయోగించుకునే పద్ధతులపై పరిశోధనలు ప్రారంభించాడు. ఫైబర్ గ్లాస్ ద్వారా పెద్దఎత్తున సమాచారాన్ని పంపవచ్చునని కనుగొన్నాడు. అయితే సాధారణ ఫైబర్‌గ్లాస్ ద్వారా కాంతి ఎక్కువ దూరం ప్రసారం కాలేదు. దీనికోసం ఆయన సిలికాన్‌తో రూపొందించిన ఫైబర్ గ్లాస్ ఉపయోగించాడు. ఆయన కనుగొన్న ఆవిష్కరణ నేడు ప్రపంచ వ్యాపితంగా ఫైబర్ ఆప్టికల్ నెట్‌వర్క్ రూపొందడానికి దారితీసింది. అయితే దీనికి తోడు మిగిలిన ఇద్దరు శాస్త్రవేత్తలు రూపొందించిన డిజిటల్ ఫోటోగ్రఫీ, కమ్యూనికేషన్స్ స్వరూపాన్నే మార్చేసింది. ఈ రోజున ఫైబర్ ఆప్టికల్ కేబుల్ నెట్ వర్క్ ప్రపంచవ్యాపితంగా ఎంతగా వేయబడిందంటే, వెంట్రుకలో లక్షవంతులకన్నా చిన్నదిగా ఉండే ఈ ఫైబర్ ఆప్టికల్ తీగలను వరుసగా పెడితే భూగోళాన్ని 25,000 సార్లు చుట్టేసి రావచ్చు. ఫోటోలను డిజిటల్ రూపంలో బంధించే డిజిటల్ ఇమేజ్ సెన్సర్ లేదా చార్జ్-కపుల్ డివైజ్ (సిసిడి)ని తయారుచేయడంతో నేడు ఇంటర్‌నెట్, వెబ్ పేపర్లు, ఇ-మెయిళ్లు వంటివన్నీ సాధ్యమైనాయి. ఎక్కడో జరుగుతున్న దృశ్యాలను ఇటర్‌నెట్‌లో లైవ్ చూడ్డానికి ఈ కేబుల్స్, కెమెరాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి.

ఏది ఏమైనా ఈ ఏడాది భారతీయ సంతతికి చెందిన వెంకట్రామన్ రామకృష్ణన్‌కు నోబుల్ బహుమతి రావడం మనందరం గర్వించే విషయం. దీంతో తమిళనాడుకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఇప్పటివరకు నోబుల్ బహుమతులు గెలుచుకున్నట్లయింది. రామకృష్ణన్ ఒకరు కాగా సర్ సివి రామన్, సుబ్రమణ్యం చంద్రశేఖర్ మిగిలిన ఇద్దరు. రామకృష్ణన్ పరిశోధన ప్రపంచ మానవాళికి ఎంతగానో ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు. ★

వివాదాల్లో శాంతి, సాహిత్య నోబుల్స్

ఆర్థిక రంగంలో ఈ ఏడాది నోబుల్ బహుమతి మొట్టమొదటిసారిగా ఒక మహిళ గెలుచుకోవడం విశేషం. ఆర్థిక వనరులు ఉంటే ప్రభుత్వం చేతుల్లో ఉండాలి, లేకుంటే ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ఉండాలే గాని ప్రజల చేతుల్లో ఉండకూడదనేది పాత ఆర్థిక సిద్ధాంతం. ఈ సిద్ధాంతాన్ని పూర్వపక్షం చేస్తూ ప్రజలతో ఏర్పడిన సహకార సంఘాలు కూడా వనరుల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించగలవని నిరూపించిన అమెరికా ఆర్థిక వేత్త ఎలినార్ ఓస్ట్రోమ్‌కు ఈసారి నోబుల్ బహుమతి లభించింది. ఈమెతో బాటు మరో అమెరికన్ ఓలివర్ విలయమ్‌సన్ నోబుల్ బహుమతిని పంచుకున్నారు.

అయితే నోబుల్ శాంతి, నోబుల్ సాహిత్య బహుమతులు పెద్ద వివాదంగా మారాయి. ఈ రెండు బహుమతులు ఎక్కువగా అమెరికా, ఇతర పశ్చిమ దేశాల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించే వారికే ఇస్తుండడం గమనార్హం. అయితే ఈ సారి అందరినీ ఆశ్చర్యపరుస్తూ నిన్న మొన్న అధికారంలోకి వచ్చిన అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాకు శాంతి బహుమతి ఇచ్చి బహుమతులు ప్రదాన కమిటీ పెద్ద ఎత్తున విమర్శలను ఎదుర్కొంటోంది. ఒబామా ఈ పదిమాసాల కాలంలో ఏం చేశారని ఆయనకు అత్యున్నత పురస్కారం ఇచ్చారు అని పరిశీలకులు నిలదీస్తున్నారు. పైగా ఆయన అధికారంలోకి వచ్చాక ఆఫ్ఘనిస్థాన్‌లో ఎన్నడూ లేనంత పెద్ద ఎత్తున రక్తపాతం నడుస్తోంది. అయితే ఒబామా చేసిన దానికి కాకుండా చెప్పిన మాటలను బట్టి అవార్డు ఇచ్చినట్లు స్వీడిష్ కమిటీ చెప్పింది. ఆయన రానున్న కాలంలో తన మాటలకు కట్టుబడేట్లు చేసి ప్రపంచశాంతికి కృషి చేయడానికి ఈ బహుమతి తోడ్పడుతుందన్నది కమిటీ అభిప్రాయం. అయితే ఈ విషయంలో కమిటీ అభిప్రాయంతో చాలా మంది ఏకీభవించడం లేదు. ఇక నోబుల్ సాహిత్య బహుమతి కూడా అమెరికా యొక్క కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారానికి తోడ్పడే రచనలు సాగించిన రుమేనియన్ మహిళకు దక్కింది. రుమేనియా సోషలిస్టు శిబిరంలో ఉన్నప్పుడు, అక్కడ కమ్యూనిస్టు నేత నికోలాయ్ సెసెస్కూ పరిపాలిస్తున్న కాలంలో జరిగినట్లు చెప్పబడుతున్న అణచివేతను విమర్శిస్తూ అనేక రచనలు చేసినందుకు గాను అమెకు ఈ బహుమతి ఇచ్చారు.

క్రైమ్ కథ

నేరం దాగదు

- యర్నాగుల సుధాకరరావు

> **ఆ రోజు రాత్రి ప్రకాష్ చీకటిలో బైక్ ఆపి రుస్తుం ఇంటిముందుకు వెళ్లాడు. అక్కడ ఎవరూ లేరు. కాలనీలో చివరి ఇల్లు అదే. ఊరకుక్కలు అరుస్తుంటే వాటిని అదిలిస్తూ తను గుడ్డలో చుట్టి తెచ్చిన నెత్తుటికత్తిని ఆ ఇంట్లోకి విసిరేసి 'హమ్మయ్య' అనుకునేవేళ పట్టేసుకున్నారు కానిస్టేబుళ్లు. ప్రకాష్ పారిపోయేందుకు గుంజుకున్నాడు. నాలుగు తన్ని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు.**

"ఈ శవం ఆనవాళ్లలేకుండా ఉన్నా, జేబులో దొరికిన పర్సు అందులో ఉన్న అడ్రసు చూస్తే ఇది ముమ్మాటికీ కిరాయిహంతకుడు రుస్తుందేనని తెలుస్తోంది. చూశారా వీడు ఎందరినో ఎన్నోరకాలుగా నెత్తురుగడ్డలను చేసేసిన పరమ కిరాతకుడు చివరకు అత్యంత దయనీయంగా కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ కిందపడి పీసులు అయిపోయాడు" పోలీసుల మధ్య తిరుగాడుతూ చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

రైలుపట్టాల పక్కనే పడున్న శవంఖండాలను గోనెసంచిలోకి ఎత్తారు పోలీసులు. చిరిగి చివికిపోయిన పర్సును వేరే పాలిథీన్ కవర్లో వేసి అక్కణ్నించి పోలీసులు కదిలారు.

రుస్తుం చచ్చినందుకు సిటీలో ప్రతిఒక్కరూ ఆనందించారు. అతడు ఎంతటి క్రూరుడో అంతటి తాగుబోతు. పీకలదాక తాగేసి పట్టాలు దాటుతూ చచ్చాడు. కిరాయికోసం నేరాలు చేస్తుంటాడు. అటువంటివాణ్ని కిరాయికి ఏదో చేయించేసి పీకలదాక తాగించి పట్టాలమీదకు తోసేసి ఉంటారు. ఇది ముమ్మాటికీ హత్యే అని జనాలు రకరకాలుగా అనుకోసాగారు. పోలీసులు మాత్రం అది ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా నమోదు చేసేశారు. అంతటితో తమ పని అయ్యిందనిపించారు.

ఇన్‌స్పెక్టర్ స్వరూప్ ఠాణాలో కూర్చుని రుస్తుం పోస్టుమార్టమ్ రిపోర్టు చూస్తుండగా వచ్చాడు ప్రకాష్.

"సార్! నాభార్య మర్డర్‌కేసు ఏమైంది? వారం రోజులుగా అలానే ఉండిపోయింది" దీనవదనంతో అడిగాడు.

"దర్యాప్తు చేస్తున్నాం. నీఇంటికి ఇరుగు పొరుగులేదు. కనీసం చిన్న ఆధారం కూడా హంతకుడు వదిలిపోలేదు. అయినా పోలీసు కళ్లలోంచి తప్పించుకుపోలేడు. ఇక నీవు రెండుపూటలా వచ్చి ఏమైంది అని అడగొద్దు. మేము ఆపనిలోనే ఉన్నాం. హంతకుడు దొరికాక నేనే కబురుచేస్తాను"

"సార్ ఎందుకో మా ఆవిడ లేకుండా నేను ఆ ఇంట్లో ఉండలేక పోతున్నాను. ఎప్పుడూ నావెంట తీసుకుపోయేవాడిని. ఆమెను వదిలివెళ్లినందుకు ఇలా ఇల్లుదోచుకుని హత్యచేసి పోయారెవరో?" కన్నీళ్లతో చెప్పాడు.

"సరే నీవు ఇలా నీరుగారిపోతే నీకు ప్రమాదం. మనస్సు కుదుట పరుచుకోవడమే" ఇన్‌స్పెక్టర్ చెబుతూనే పోస్టుమార్టమ్ రిపోర్టును చూసుకోసాగాడు.

"సార్ మరోవిషయం. నిన్న ట్రయిన్ యాక్సిడెంటులో చచ్చిన ఆ రుస్తుంగాడు ఒకసారి మాఇంటి ముందు తచ్చాడడం చూశాను. వాడేనేమో నాఇల్లుదోచి నాభార్యను చంపేశాడని అనుమానం"

అప్పుడు తలెత్తిచూశాడు ఇన్‌స్పెక్టర్.

"ఆరోజు ఎందుకు చెప్పలేదు ప్రకాష్. ఇప్పుడు కొత్తగా చెబుతున్నావు. తీరా వాడు చచ్చాడు. ఇప్పుడు వాడికోసం యమపురికి పోవాలి. ఏదైనా రిపోర్టు చేసేటపుడు అన్నీ సరిచూసుకుని ఏదీ వదలకుండా ఫిర్యాదు చేయాలి. నీవు సరిగ్గా మాకు సహకరించలేదు. అసలు రుస్తుం చావడం వల్ల వాడి మీదున్న కొన్నికేసులు నీరుగారిపోయాయి."

"నాభార్య మర్డర్‌ను తట్టుకోలేకపోయాను. మీకు సరిగ్గా రిపోర్టు చేయలేకపోయాను. గుర్తొచ్చింది కనుక మీ దృష్టికి తెచ్చాను. ఒకవేళ వాడే అయితే నా ఉసురు తగిలి వారం తిరక్కుండానే ముక్కలయి చచ్చాడు. ముమ్మాటికి వాడే చంపాడు. నోడవుట్"

ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌వైపు నిశితంగా చూశాడు.

"అది తేల్చాల్సింది నీవు కాదు. మేము."

"రుస్తుం ఇంటిని సోదా చేసి ఉంటే వాటిల్లో నా ఇంట్లో దోచుకుని పోయిన నగలు ఏమైనా దొరికాయా సార్"

ఇన్‌స్పెక్టర్ తల అడ్డంగా ఊపి "ఇక నీవు వెళ్లొచ్చు. రుస్తుం ఇంట్లో ఇంకా తనిఖీలు చేయలేదు. బహుశా రేపు తప్పితే ఎల్లుండి వెడతాం."

ప్రకాష్ వెనుదిరిగి తన మోటార్‌సైకిల్‌మీద వెళ్లిపోయాడు.

ఇన్‌స్పెక్టర్ స్వరూప్ ప్రకాష్ గురించి ఆలోచించాడు. ఇద్దరు కానిస్టేబుళ్లను పిలిచి "మీరు రుస్తుం ఇంటికి దూరంగా ఉండి 24 గంటలపాటు అబ్జర్వుచేయండి" చెప్పి పంపాడు.

ఆ రోజు రాత్రి ప్రకాష్ చీకటిలో బైక్ ఆపి రుస్తుం ఇంటిముందుకు వెళ్లాడు. అక్కడ ఎవరూ లేరు. కాలనీలో చివరి ఇల్లు అదే. ఊరకుక్కలు అరుస్తుంటే వాటిని అదిలిస్తూ తను గుడ్డలో చుట్టి తెచ్చిన నెత్తుటికత్తిని ఆ ఇంట్లోకి విసిరేసి 'హమ్మయ్య' అనుకునేవేళ పట్టేసుకున్నారు కానిస్టేబుళ్లు. ప్రకాష్ పారిపోయేందుకు గుంజుకున్నాడు. నాలుగు తన్ని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు.

ప్రకాష్‌ను ఠాణాలో నేలమీద కూర్చోబెట్టారు.

అప్పటికే ప్రకాష్ అత్తమామలు కూడా అక్కడికి వచ్చి అంతులేని ఆశ్చర్యంతో ఉన్నారు. "అల్లుడు మంచివాడనే అనుకున్నాం. వీడే మా బిడ్డను చంపేశాడా? తేనెపూసిన కత్తిలా మనమధ్య ఉంటూ ఇంత ఘోరంగా నేరం చేశాడా?" అని బావురుమన్నారు.

"ప్రకాష్ నీవు తల పట్టుకుని శూన్యంలోకి చూడడం వంటివి తర్వాత. జైలు గోడల మధ్య 14ఏళ్లు చేయవచ్చు ఆపని. ఇప్పుడు మాకు నీవు చేసిన దారుణహత్యను ఒక్కముక్కకూడా దాచకుండా నిజం చెప్పాలి. లేకుంటే నిన్ను చాలా దారుణంగా హింసిస్తాను. ఎందుకంటే నీవు నన్ను వెర్రివాజమ్మను చేసి నేరం దాచాలనుకున్నావు. చచ్చిన రుస్తుంను నీ భార్య హంతకుడిగా చిత్రించ చూశావు. అప్పుడే నిన్ను అనుమానించాను."

"నాభార్యను చంపాను. ఇందుకు ఆమె ఏ తప్పూ చేయలేదు. నేనే ఈమధ్య వేరే అమ్మాయి ప్రేమలో పడ్డాను. నేను వివాహితుడనని నా లవర్‌కు తెలియదు. అప్పుడే నేను నా భార్యను వదిలించుకోవాలను కున్నాను. అందుకు నాభార్యకు ఈరాత్రి ఆఫీసు పనిమీద క్యాంపుకు వెళ్లివచ్చేస్తానని చెప్పి వెళ్లాను. ఆమె నిజమనుకుని ఒంటరిగా ఇంట్లో ఉంది. ఆ రాత్రే వెనుదిరిగి వచ్చేశాను. ట్రయిన్ తప్పిందని చెప్పాను. ఆమెకు రసగుల్లా జ్యూస్‌లో నిద్రమాత్రలు కలిపి ఇచ్చాను. మత్తులోఉండగా కత్తితో గొంతు కోశాను. ఆ వెంటనే ఇంట్లో వస్తువులు నేనే దోచుకుని నిజంగానే క్యాంప్‌కు వెళ్లిపోయాను. చివరికి నేను చేసిన హత్యను రుస్తుంమీదకు నెట్టాలనుకున్నాను." నిజాన్ని ఒప్పేసుకున్నాడు ప్రకాష్.

పోలీసులు, ప్రకాష్ బంధువులు అదంతా విని అవాక్కయ్యారు.

"సార్ నాభార్య ఎంతో మంచిది. కొత్తగా ప్రేమలో పడి బుద్ధిహీనుడనై చంపుకున్నాను. ఇందులో దోషమంతా నాదే. వేరెవ్వరిదీ కాదు. నన్ను ఉరి తీయించండి. క్షణికమైన ఆవేశంతో చంపుకున్నాను" తల బాదుకున్నాడు.

★



మీరంతా నా పాట వింటారు కాని నాకు మాత్రం
మన్నాడే పాట వింటేగాని నిద్ర పట్టదు
- మహ్మద్ రఫీ

హిందీ చిత్రసీమను తొలిమలి దశకాలలో గాయక తారలు ఏలితే మూడవ దశకారంభం నాటికి పరిస్థితి మారింది. హిందీ సినీ శ్రోతలను ముఖేష్, తలత్ మహమూద్, రఫీ, కిశోర్‌లు పరవశానంద డోలికల్లో తేలియాడిస్తున్నారు. ఆ పరిస్థితుల్లో 'ఊపర్ గగన్ విశాల్ (మషాల్)' పాటతో భారతీయ హృదయాన్ని ఆవిష్కరించి ఒక్కసారిగా అందరినీ ఉలిక్కి పడేలా చేసిన గాయకుడు మన్నాడే.

ఫాల్కే అవార్డుకు సరికొత్త గౌరవం

- హెచ్.రమేష్‌బాబు

మన్నాడే భారతీయ సినిమాలో శాస్త్రీయ సంగీత ధోరణిలో పాటలు పాడి వాటిని జనసామాన్యానికి చేరువ చేసిన మధురగాయకుడు. హిందీ సినీపరిశ్రమను పాతికేళ్ళపాటు (1950-75) చకచ్చకితం చేసిన గాయకునిగా మన్నాడే ఒక తరం సినీప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ మహాగాయకుడు తన సినీసంగీత సేవలకు గుర్తింపుగా 2007వ సంవత్సరానికి గాను భారత ప్రభుత్వ అత్యున్నత సినీ పురస్కారంగా పేర్కొనే దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికైనారు. ఒకరకంగా ఈ నిర్ణయం భారతీయ సినిమాలో ఆలస్యంగానైనా సంగీత విభాగాన్నే గౌరవించినట్టైంది. 1969లో ప్రారంభమైన ఈ ఫాల్కే అవార్డును ఇప్పటి దాకా 39 మందికి ప్రకటించగా వీరిలో నలుగురు సంగీత దర్శకులు, ఇరువురు గాయనులు, ముగ్గురు గాయకతారలుండగా ఏకైక గాయకుడు మన్నాడే. ఫాల్కే అవార్డులకు అర్హమైన ముఖేష్, రఫీ, తలత్, కిశోర్‌ల పరంపరలో మన్నాడేకి ఈ అవార్డు రావడమంటే వారందరికి సముచిత నివాళి సమర్పించడమే అవుతుంది.

మన్నా అసలు పేరు ప్రబోధ్ చంద్రడే. కలకత్తాలో 1919 మే 1న పుట్టాడు. తండ్రి వృత్తిరీత్యా న్యాయవాది. తన కొడుకు నల్లకోటు వేసుకొని కోర్టులో వాదించాలని కలలు కన్నాడు. కాని జరిగింది మరోటి. మన్నాడే తన మేనమామ కె.సి.డే(కిశోర్‌చంద్రడే) వద్ద సంగీత పాఠాలు నేర్చుకోవడం మొదలు పెట్టారు. అసమాన ప్రతిభతో కె.సి.డేకి ఇష్టుడై "మన్నాడే"గా పిలుపునందుకున్నారు. చివరికి అదే ఆయన పేరై కూర్చుంది. కలకత్తా నుండి బాంబే చేరుకున్న మన్నాడే... ఉస్తాద్ అమీన్ అలీఖాన్, అబ్దుల్ రహమాన్ వద్ద శాస్త్రీయ సంగీతంలో మరిన్ని మెళకువలు నేర్చుకొని ఎస్‌డి బర్మన్ వద్ద అసిస్టెంట్‌గా చేరారు. కె.సి.డే వద్ద శిక్షణ సరేసరి. ఈ తర్ఫీదే మన్నాడేను తర్వాతి కాలంలో సంగీత దర్శకత్వం వహించేలా చేసింది. మన్నాడే అందరూ అనుకున్నట్లుగా ఆ మధ్య అన్ని పత్రికల్లో రాసినట్లుగా మొదట వారు పాడింది "తమన్" 1943 లో కాదు. ఆయన తొలుత పాడింది 'రామ్‌రాజ్య'లో. అదీ 1943లో వచ్చిన చిత్రమే. మన్నాడే రఫీ, తలత్‌ల కాలంలోనే గాయకునిగా సినీరంగంలోకి ప్రవేశించినా వారి ప్రభంజనంలో వెనువెనకనే ఉండిపోయారు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని ఉనికిని కాపాడుకున్నారు. క్యారెక్టర్ పాత్రలకు మాత్రమే పాడే గాయకునిగా మన్నాడేని కొందరు పరిమితం చేసినా రాజ్‌కపూర్, దిలీప్, రాజేంద్రకుమార్, దేవ్, రాజేష్‌ఖన్నా వంటి హీరోలకీ పాడారు. బల్‌రాజ్ సహానీకి పాడిన 'ఏయ్ మేరే జాహ్రా జబీ (వక్త్)' పాట ఆయన కెరీర్‌లో ఆల్ టైం హిట్. అలాగే 'మేరే హుజూర్' లో రాజ్‌కుమార్‌కు పాడిన 'జనక్ జనక్ బాజే పాయలియా' పాట కూడా.

కమర్షియల్ హిందీ సినిమాకు శాస్త్రీయ సంగీతపు సొగసులు దిద్దిన పాటను

నవీన్ పట్నాయక్‌తో మన్నాడే



మన్నాడే, రఫీ, తలత్



నాటి తరం నాయనీ గాయకులతో



అబ్దుల్ కలాంతో

ఆభరణంగా అందించిన మన్నాడే కొన్ని క్యారెక్టర్, అతిథి పాత్రధారులకూ పాడారు. ఉదాహరణకు 'జంజీర్'లో ప్రాణ్‌మీద 'యారీ హై ఇమాన్ మేరా యార్ మేరి జిందగీ'. అలాగే 'పరిణీత'లో బిచ్చగాడి మీద చిత్రీకరించిన 'చలే రాధే రాణి', బిమల్ రాయ్ 'దో బిగా జమీన్'లో బాల్‌రాజ్ సహానీ మీద చిత్రీకరించిన 'ధర్తీ కహే పుకార్‌కే' పాటలు ఎంత జనరంజకమైనవో తెలిసిందే. కాని రాజ్‌కపూర్‌కి 'ఆవారా'లో 'ప్యార్ హువా ఇకరార్ హువా', 'చోరి చోరి'లో "యే రాత్ భీగీ భీగీ, 'మేరా నామ్ జోకర్ " లో 'ఏ భాయ్ జర దేఖ్ కే చలో' పాటలు గొప్ప హిట్. ఇలా రాజ్ ఒక్కరికేమిటి దిలీప్, దేవానంద్ వంటి హీరోలకు తక్కువ పాడినా వాసిలో మాత్రం గుర్తుండిపోయేవే.

మన్నాడే పాటల్లో శాస్త్రీయ సంగీతం పోకడలున్నవే ఎక్కువగా కనిపించినా అద్భుతమైన సోలోలు, డ్యూయెట్లు, ఫాస్ట్ బీట్లు, కవ్వాలీలు, సెమీక్లాసికల్ కామెడీ గీతాలు, భజనలు... అన్నీ పాడి మెప్పించారు. కమెడియన్లకి, క్యారెక్టర్ పాత్రధారులకు పాడే గాయకుడిగా ఇండస్ట్రీలో ముద్రపడిన ఆయన హిందీ పాటపై మాత్రం తనదైన ప్రత్యేక ముద్రను వేయడంలో రాజీపడని అద్భుత గాయకుడు.

రవీంద్ర సంగీతంలో మన్నాడేది ప్రత్యేకమైన ముద్ర. బెంగాలీలో హేమంత్‌కుమార్‌తో కలిసి పాడిన చాలా పాటలు పాపులర్. ఇంకా ఒరియా, కన్నడంలోను ఆయన పాడారు. ఇక మళయాళంలో పేరున్న ఏకైక కేరళేతర గాయకుల్లో మొదటివాడు ఆయన. పైగా మళయాళ అమ్మాయి సులోచనను ప్రేమించి పెళ్ళాడాడు. ఆమె కూడా గొప్ప గాయని. తొంభై ఏళ్ళ మన్నాడే 80 ఏళ్ళకు పైగా సంగీత ప్రపంచంలోనే జీవితాన్ని సాఫల్యం చేసుకున్నాడు. ఎన్నో అవార్డులు ఆయనను వరించాయి. వాసిలో ఎన్నదగిన 3 వేల పాటలే ఆయనకు ఆభరణాలు. అంతటి కళామూర్తికి ఫాల్కే అవార్డు రావడం భారతీయ సినీసంగీతకారులకు గర్వకారణం. దీంతో ఫాల్కే అవార్డు గౌరవమూ పెరగింది.

★

పురస్కారాలు - సత్కారాలు

మన్నాడేకు లభించిన పురస్కారాలు, సత్కారాలను ఓసారి గుర్తుచేసుకుందాం. పద్మశ్రీ, పద్మభూషణ్, జాతీయ ఉత్తమ గాయకుడు, ఫిల్మ్‌ఫేర్ అవార్డు, లతామంగేష్కర్ అవార్డు, పి.సి.రే అవార్డు, కమలాదేవి రాయ్ అవార్డు, ఆనంద్ లోక్ అవార్డు, కన్నడ మళయాళీ, ఒరియా ఉత్తమ గాయకుని అవార్డు, తాజాగా దాదా ఫాల్కే అవార్డు.

మెచ్చుతునకలు

కౌన్ ఆయా మేరే మన్‌కే ద్వారే
ఊపర్ గగన్ విశాల్
ప్యార్ హువా ఎకరార్ హువా
ఏ రాత్ భీగీ భీగీ
ఏ మేరే జొహరా జబీ
జిందగీ కైసీ హై పహేలీ హాయ్
తు చుపీ హై కహా
తూ ప్యార్ కా సాగర్‌హై
ఆజా సనమ్ మధుర్ చాందనీ
యారీహై ఇమాన్ మేరీ
ధర్తీ కహే పుకార్‌కే

ఫాల్కే విజేతలు

1.	దేవికారాణి	1969
2.	బి.ఎన్.సర్కార్	1970
3.	పృథ్వీరాజ్ కపూర్	1971
4.	పంకజ్ మల్లిక్	1972
5.	రూబి మేయర్ సులోచన	1973
6.	బి.ఎన్.రెడ్డి	1974
7.	ధీరేన్ గంగూలీ	1975
8.	కాననదేవి	1976
9.	నితిన్‌బోస్	1977
10.	ఆర్.సి.బోరాల్	1978
11.	సోహ్రాబ్‌మోడి	1979
12.	పైడి జైరాజ్	1980
13.	నౌషాద్ అలీ	1981
14.	ఎల్.వి.ప్రసాద్	1982
15.	దుర్గా కోటే	1983
16.	సత్యజిత్‌రే	1984
17.	వి.శాంతారాం	1985
18.	బి.నాగిరెడ్డి	1986
19.	రాజ్‌కుమార్	1987
20.	అశోక్‌కపూర్	1988
21.	లతామంగేష్కర్	1989
22.	అక్కినేని నాగేశ్వరరావు	1990
23.	బాలాజీ పెండార్కర్	1991
24.	భూపేన్ హజారికా	1992
25.	మజ్రూ సుల్తాన్ పురి	1993
26.	దిలీప్‌కుమార్	1994
27.	రాజ్‌కుమార్	1995
28.	శివాజీగణేషన్	1996
29.	ప్రదీప్ కవి	1997
30.	బి.ఆర్.చోప్రా	1998
31.	రుషికేష్ ముఖర్జీ	1999
32.	ఆశాభోంస్లే	2000
33.	యశ్‌చోప్రా	2001
34.	దేవానంద్	2002
35.	మోనాల్‌సేన్	2003
36.	ఆదూర్ గోపాల్ కృష్ణ	న్ 2004
37.	శ్యామ్‌బెనగల్	2005
38.	తపన్ సిన్హా	2006
39.	మన్నాడే	2007

(ఈ నెల 21 న మన్నాడేకి ఫాల్కే అవార్డు ప్రదానం సందర్భంగా)

కథ

వారసత్వం

-ఓ. ప్రకాశరావు

"సమర్పితా మేడమ్, మీకు ఫోను" పక్కసీటులోనున్న వ్యక్తి చెప్పాడు. సమర్పిత రిసీవర్ తీసుకుని "హలో" అంది.

"సమర్పితా... నేనమ్మా... మీనాన్నను... ఆస్తి అంతా మీ అన్నయ్య పేర రాసి చాలా పొరపాటు చేశానమ్మా... మోసపోయానమ్మా..."

చాలాకాలం తరువాత ఫోను చేసిన తండ్రికి అక్కడ ఏదో జరిగిందన్న నిర్ణయానికి వచ్చి "నాన్నా, ఏమైంది నాన్నా, అన్నయ్య వదినలు నిన్ను అవమానపరిచారా" నొసలు చిట్లించి కోపంగా అంది.

"సమర్పితా, మాటలతో చెప్పలేనమ్మా... అలాంటి అవమానం పగవాడికి కూడా కలుగకూడదమ్మా. నీవు ఫోను చేసినప్పుడంతా నేను అక్కడే ఉన్నా లేనంటూ నీతో అబద్ధం చెప్పి ఫోను కట్ చేస్తాడు... నేను బాగా అలసిపోయాను. బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. ఇంకాసేపట్లో నేను ఆత్మహత్య చే..సు..కో..బో..తు..న్నా..ను.." చివరి మాట ఏడుపు గొంతుతో చెప్పాడు జగన్నాథం.

"నాన్నా.." అంటూ ఆందోళనతో బిగ్గరగా చెప్పబోతున్న సమయంలో తండ్రి ఫోను కట్ చేశాడన్న సంగతి తెలుసుకుని ఏంచెయ్యాలో అర్థంకాక టేబుల్ మీద తల ఆన్చి వెక్కివెక్కి ఏడవసాగింది. ఆఫీసు స్టాఫ్ అందరూ ఒక్కసారిగా గమనించారు. పక్క సెక్షన్‌లో నుంచి తన దగ్గరకు వస్తున్న భర్తను చూసి "ఏమండీ... మా నాన్న ... నాన్న" అంటూ బేలగా కన్నీళ్లతో జరిగింది చెప్పింది.

"సమర్పితా మీ అన్నయ్య ఇంతకు మునుపే నాకు ఫోను చేశాడు. కాస్తకూడా మర్యాద లేకుండా మాట్లాడాడు. తండ్రిని గౌరవించాలన్న ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడాడు. "మూడు రోజుల క్రితం ఇల్లువదిలి వెళ్లిన ఆ ముసలోడు మీ ఇంటికి వచ్చాడా చచ్చాడా?" అనడిగాడు. మీ సెక్షన్ ఫోను ఎంగేజ్‌గా ఉండడం వల్ల నాకు ఫోను చేసినట్లు చెప్పాడు. ముందు మామగారిని కాపాడాలి" అన్నాడు భర్త.

ooo

తన కూతురు సమర్పితతో టెలిఫోనులో మాట్లాడి అద్దాల తలుపు తెరుచుకుని కన్నీళ్లతో బయటికి వచ్చాడు 65 సంవత్సరాల జగన్నాథం. నిర్లిప్తంగా సముద్రం దగ్గరకు నడుచుకుంటూ వెళ్లాడు.

ooo

మధ్యాహ్నం 12 గంటలు కావడం వల్ల ఎండ తీక్షణం ఎక్కువగా ఉంది. ఎగిసిపడుతున్న అలల వైపు చూస్తూ "తొందరగా సముద్రంలోనికి వెళ్లి ఈ తనువు చాలించాలి" అనుకున్నాడు జగన్నాథం.

కాళ్లకున్న చెప్పులు, వేసుకున్న చొక్కా, బనియన్ తీసి ఇసుకపై పెట్టాడు. కట్టుకున్న పంచెతో సముద్రంలోకి అడుగులు వేసుకుంటూ నడవసాగాడు. ఓ పెద్ద అల జగన్నాథాన్ని ముంచగానే ఉక్కిరిబిక్కిరై ఉప్పునీరు తాగాడు. ఆ క్షణాల్లో ఆ ఉప్పునీరే తులసితీర్థం అనుకున్నాడు. అంతలో సముద్రంలోంచి వేగంగా వస్తున్న అల జగన్నాథాన్ని ఒడ్డుకు ఒక్కసారిగా విసిరికొట్టింది.

ఉప్పునీరు తాగడం వల్ల అలసటతోనూ, ఊపిరి సరిగ్గా పీల్చలేకపోవడంతోనూ నీరసంగా అలాగే కూర్చొని సేద తీర్చుకున్నాడు. అలసట తీరాక మళ్లీ సముద్రంలోకి నడుచుకుంటూ వెళ్లాడు. ఒక అల అతణ్ని ఆహ్వానిస్తూ మరొక అల ఒడ్డుకు విసిరికొట్టింది. పట్టువదలని విక్రమార్కుడిలా ఎన్నోసార్లు ప్రయత్నించసాగాడు జగన్నాథం. ఎప్పటిలా మళ్లీ కాసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత సముద్రంలోకి వెళ్లగానే విసిరివేయబడ్డాడు. కళ్లుతెరిచి చూచి ఒక్కసారిగా అవమానంతో చలించి పోయాడు. జగన్నాథాన్ని తిరస్కరించిన ఆ సముద్రం అతను కట్టుకున్న పంచెను లోనికి తీసుకెళ్లి నగ్నంగా ఉన్న అతణ్ని ఒడ్డుకు విసిరేసింది. తను వదిలిన చొక్కా, బనియన్ చోటు నుంచి చాలా దూరం వచ్చిన సంగతి అప్పుడు గర్తించాడు జగన్నాథం.

జీపుదిగి తనవైపు వేగంగా వస్తున్న ఇద్దరు వ్యక్తులను చూడగానే రెండు మోకాళ్లను ఒక్కటిగా చేర్చి సిగ్గుతో తల వంచుకున్న జగన్నాథం కన్నీరు వరదలా ప్రవహింపసాగింది. ఆ ఇద్దరు వ్యక్తులు జగన్నాథం దగ్గరకు వేగంగా వచ్చారు.

"నా కన్న కొడుకు నా ఆకలి గురించి పట్టించుకోకుండా నాముందే పంచభక్ష్యపరమాన్నాలు తింటూ ఉంటే కోపంతో అడిగినందుకు వాడు కన్నతండ్రి అన్న జాలి లేకుండా కాలితో తన్ని నన్ను బయటికి తరిమాడు. ఆ అవమానం, బాధ భరించలేక ఎవరికీ తెలియకుండా ఇలా దూరంగానున్న ఈ ఊరికి వచ్చాను. సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకుందాం అనుకున్నాను. కానీ ఆ సముద్రుడు కూడా నా కొడుకు లాగే రాక్షసంగా ప్రవర్తించాడు. నేను కట్టుకున్న పంచెను లాక్కొని నన్ను నగ్నంగా చేసి బయటికి విసిరికొట్టాడు. నన్ను దిగంబరుణ్ని చేసినందుకు ఆ అలలు ఎంత సంతోషముతో ఎగిసి పడుతున్నాయో చూడండి" అంటూ ఉన్మాదిలా బిగ్గరగా ఏడుపుగొంతుతో అంటున్న జగన్నాథం కళ్లలో నీరు మరింత ఉధృతంగా ప్రవహింపసాగింది.

ఒక వ్యక్తి ఆయన భుజంపై ఓదార్పుగా చేయి వేసి "మీరు మీ కొడుకు రాక్షస ప్రవర్తన వల్ల ఆవేశంలో ఇలా పొరపాటు నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాదులో మీ అమ్మాయి సమర్పిత మీ కోసం ఎంత ఆవేదన పడుతుందో ఆలోచించారా..." అన్నాడు.

సమర్పిత పేరు వినగానే ఒక్కసారి ఏడుపు ఆపి వారివైపు ఆశ్చర్యంగా చూశాడు జగన్నాథం.

"మేము పోలీసు డిపార్టుమెంటువారం. మీరు ఈ ఊరు నుంచి ఫోను చేసిన విషయం తెలుసుకున్నారు. మీ ఫోటోతో పాటు అన్ని వివరాలూ తెలుపుతూ ఫ్యాక్స్ పంపారు. మీ అమ్మాయి, అల్లుడు ఈ సాయంత్రానికంతా ఇక్కడకు వస్తారు..." అంటూ చెప్పారు.

ooo

"సమర్పితా, ఇక మీదట ఆత్మహత్యా ప్రయత్నం చెయ్యనమ్మా... నా మీద ఒట్టు సరేనా... " అన్నారు జగన్నాథం.

"నా మీద ఒట్టు పెట్టాకనే నాకు మనశ్శాంతి లభించింది నాన్నా" అంది తృప్తిగా.

"కానీ ఒక్క విషయం. నా మీద ఏ మాత్రం ఆప్యాయతా, అనురాగమూ లేని మీ అన్నయ్యలో మార్పు వచ్చేంత వరకూ నేనిక్కడున్నానన్న విషయం చెప్పకూడదు" అన్నాడు జగన్నాథం.

"మీరు చెప్పమని చెప్పేంత వరకూ ఈ విషయం చెప్పను నాన్నా..."

ooo

తిరిగి హైదరాబాదు చేరుకున్నారు. అక్కడ జగన్నాథానికి నటరాజు పరిచయం అయ్యాడు. మొదటి పరిచయంలోనే గొప్ప స్నేహితుడయ్యాడు. నాలుగు రోజులు గడిచింది.

"జగన్నాథం ఈ రోజు సాయంత్రం ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వున్న ఓ మిత్రుణ్ణి చూడడానికి వెళ్తున్నాం. భోజనం చేసి విశ్రాంతి తీసుకో. నేను ఇంటికి వెళ్ళి భోజనం చేసి విశ్రాంతి తీసుకుని వస్తాను" అంటూ నటరాజు వెళ్లిపోయాడు.

ooo

సాయంత్రం ఆటోలో జగన్నాథం, నటరాజు కలిసి ఆ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్ళారు. అక్కడ ఎయిర్ కండిషన్ గల స్పెషల్ రూములో బెడ్‌పై పడుకుని దినపత్రిక చదువుతున్న వ్యక్తి గంగాధరంతో "నేను ఇంతకు మునుపు చెప్పిన జగన్నాథం ఇతనే.. జగన్నాథం... నేను మీకు చెప్పిన రోగి కాని రోగి గంగాధరం ఈయనే" ఇద్దరికీ పరిచయం చేశాడు నటరాజు.

"ఏ జబ్బూ లేకుండా ఎందుకిలా అడ్మిట్ అయ్యారు." అడిగాడు జగన్నాథం.

"అంతా నా కర్మ" విరక్తిగా అన్నాడు గంగాధరం.

"గంగాధరం గురించి నేను చెబుతాను. వాళ్ళబ్బాయి సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంచి జీతంగల పెద్ద ఉద్యోగంలో వున్నాడు. వాళ్ళ అబ్బాయి మనసు కూడా సాఫ్ట్‌గా వుండడంతో గంగాధరం దగ్గర కోడలు మానవత్వం లేకుండా ప్రవర్తించినా ఏమీ చేయలేని అసమర్థుడిలా లోలోన కుమిలిపోయేవాడు ఈయనగారి సాఫ్ట్ కుమారుడు. ఆ కంపెనీ వారికి ఈ ప్రైవేటు ఆసుపత్రిలో ఉచిత వైద్యం పొందడానికి కాంట్రాక్టు కుదిరింది. ఉచిత వైద్యం కాబట్టి ఈయనగారి కోడలికి ఓ కొత్త ఆలోచన కలిగింది. ఏదో ఒక వ్యాధి పేరుతో స్పెషల్ రూములో అడ్మిట్ చేయడం, కొన్ని రోజుల తరువాత డిశ్చార్జి కావడం. మరికొన్ని రోజుల తరువాత వేరొక కారణంతో అడ్మిట్ చేయడం..." అన్నాడు నటరాజు.

"పాపం... వారి సమస్యకు శాశ్వత పరిష్కారం లేదా..."

"గంగాధరం రేపు డిశ్చార్జి అవుతున్నాడు. మరో వారం రోజుల్లో ఈయన సమస్యకు కొత్త పరిష్కారం ఏర్పడుతుంది. ఆ తరువాత ఇలా ఏ రోగమూ లేకుండా ఆసుపత్రిలో అడ్మిట్ కావలసిన అవసరం ఏర్పడదు...' అన్నాడు నటరాజు.

"ఎలా...? సంతోషం.. ఆశ్చర్యం కలసిన గొంతుతో అడిగాడు జగన్నాథం.

'ఆ విషయం నీకు కూడా వారం లోపు చెప్తాను" అన్నాడు నటరాజు.

మళ్లీ సస్పెన్సుగా అసలు సంగతి పక్కన పెట్టినందుకు కొద్దిగా నిరుత్సాహం కలిగింది జగన్నాథం మనసులో.

ooo

నటరాజును చూడగానే జగన్నాథానికి పోయిన ప్రాణం వచ్చినట్లనిపించింది.

"నటరాజు, పోయిన వారం గంగాధరాన్ని చూసి అసుపత్రి నుంచి ఇంటికి వచ్చాక వారం రోజుల తరువాత వస్తాను అంటూ చెప్పివెళ్ళావు. ఎప్పుడు వెళ్తున్నది కూడా చెప్పనేలేదు... ఇంతకు గంగాధరం సమస్యకు పరిష్కారం లభించిందా" అడిగాడు జగన్నాథం.

"జగన్నాథం ఆ విషయాన్ని తరువాత చెబుతాను. ముందు నీవు ఇక్కడ ఎలా వున్నావు?" అడిగాడు నటరాజు.

"నీవు మాత్రం ఏమడిగినా తరువాత చెబుతాను అంటూ మాట మారుస్తున్నావు. నేను మాత్రం నిన్ను ప్రాణస్నేహితుడిగా భావిస్తున్నాను. ఏదీ నా మనసులో దాచుకోకుండా నీకు చెబుతున్నాను. నేను గత రెండు రోజులుగా బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. మళ్లీ మా అబ్బాయి దగ్గరికెళ్ళి ఆ నరకకూపంలో ఈ శేష జీవితాన్ని గడపదలచుకున్నాను" అన్నాడు బాధగా.

"జగన్నాథం... ఏమిటి ఏమైంది... మీ కూతురు గానీ అల్లుడు గానీ నీ దగ్గర కఠినంగా ప్రవర్తించారా...? అడిగాడు నటరాజు ఆత్రుతతో.

"నా కుతూరు, అల్లుడు నన్ను ఎంతో మర్యాదగా చూసుకుంటున్నారు. ఉన్నది ఒక బెడ్‌రూము, ఒక హాలు. బెడ్ రూములో కూతురు అల్లుడు పడుకుంటారు. ఇంటర్ చదివే మనవరాలు, టెన్త్ చదివే మనవడితో పాటు హాలులో నేను పడుకుంటాను. ఒక్కోసారి రూములో నా గురక, ఉబ్బసం వల్ల వచ్చే దగ్గు వల్ల ఆ పిల్లల నిద్రకు, చదువుకు ఆటంకం కలుగుతున్న సంగతి గమనించాను. నా వల్ల మార్కులు తగ్గుతాయన్న భయం నాలో కలిగింది. అంతేకాదు ఉద్యోగానికి వెళ్ళే సమర్పితకు నా వల్ల ఇంటిపని ఎక్కువగా పెరగడం గమనించాను. నమ్మకమైన పనిమనిషి కుదరనందు వల్ల ఇంటిపని అమ్మాయే చేయవలసి వస్తోంది. అన్నివిధాలుగా ఆలోచించి కొడుకు దగ్గర గడపడమే తగిన మార్గమనుకున్నాను".

"నీ సమస్యకు అది సరైన మార్గం కాదు. ప్రస్తుతం గంగాధరం వృద్ధుల ఆశ్రమంలో చేరాడు తెలుసా..."

"మంచి మార్గం అంటే ఏమిటా అనుకున్నాను. కన్న కొడుకు బతికి వుండగా వృద్ధుల ఆశ్రమంలోనా... " జాలిగా అన్నాడు.

"ఈ తరం తల్లిదండ్రులు తమ ఒకటో తరగతి చదివే కొడుకును చాలా దూరంలో వున్న రేసిడెన్షియల్ స్కూల్లో చేర్పించడానికి సిద్ధ పడుతున్నప్పుడు మన తరం వారు వృద్ధుల ఆశ్రమంలో చేరడం అంటే పెద్ద నేరంలాగా భావిస్తున్నారు. నీ సమస్యకు కూడా వృద్ధుల ఆశ్రమంలో చేరడమే సరైందేమో ఆలోచించు..."

"ఊ...హూ.. దానికన్నా ఆత్మహత్యే ఎంతోమేలు.. అనాథలాగా వృద్ధుల ఆశ్రమంలో... " ఆ పైన చెప్పడానికి గొంతు మూగ పోవడంతో మాటలు ఆపిన జగన్నాథం కళ్ళనుండి కన్నీటి బొట్లు జలజలమని రాలాయి.

ooo

"..... ఇక మీదట తరంవారు తమ పిల్లల మీద ఎంతటి ప్రేమవున్నా ఆస్తిని మాత్రం వారు బతికి వున్నంతవరకూ పిల్లల మీద రాయరు. మన భారత దేశంలో వృద్ధుల సంఖ్య 2010 సంవత్సరం నాటికి 12.4 కోట్ల మంది వుంటారని నిపుణుల అంచనా. కొంతకాలం తరువాత వీధి వీధికి ఒక వృద్ధుల ఆశ్రమం ఏర్పడవచ్చు. మీరు చేరబోతున్న వృద్ధుల ఆశ్రమం ఎలావుంది." అడిగింది సమర్పిత.

"చాలా బాగా నచ్చింది సమర్పితా. సుమారు ఎనభై సంవత్సరాల మధ్య వయసుగల స్వామీజీ ఆ వృద్ధుల నిలయానికి అధికారి అట. బారెడుగడ్డం, పొడవాటి జుట్టు, నుదుట విభూది, కాషాయదుస్తులతో నున్న వారి కళ్ళలో ఏదో దివ్య తేజస్సు. నేను వారి ముందుకెళ్ళి నమస్కరించి నా గురించి చెప్పడానికి నోరు తెరవబోతుంటే ఏమీ చెప్పనక్కరలేదు. అన్నీ తెలుసు అన్నట్లు సైగ చేసి గుమాస్తాను పిలిచి నన్ను ఈ వృద్ధాశ్రమంలో ఫీజు లేకుండా చేర్చుకోమని ఆదేశించడం అక్కడి వారి అందరితో పాటు నాకు కూడా ఆశ్చర్యం కలిగించింది. సామన్యంగా ఉచితంగా చేరాలంటే ఎన్నో విధాల ప్రశ్నించిన తరువాత నిర్ణయం తీసుకుంటారట...."

"ఆ స్వామీజి 15 సం॥ క్రితం ఆ శ్రమంలో చేరారు. అక్కడ యోగాశనం, ప్రాణాయమం, ధ్యానంలో శిక్షణ పొంది అతి తక్కువ కాలంలోనే మంచి యోగా మష్టారుగా పేరు పొందారు. ఆయన ఆ వృద్ధాశ్రమనందు వారికి మాత్రమే కాకుండా బయటి వారికి కూడా ప్రాణాయమం, ధ్యానం నందు శిక్షణనిచ్చి మానసికంగా దెబ్బతిన్న వారిని గుణపరిచాడు. ఆయన వల్ల మానసికంగా కోలుకొన్న ధనవంతులు ఆ నిలయానికి పెద్ద మొత్తంలో విరాళాలు ఇవ్వడం ప్రారంభించారు. ప్రస్తుతం ఆయనే ఆ వృద్ధాశ్రమానికి అధికారిగా వుంటున్నారు. వృద్ధాప్యంలో ఏదో ఒక కారణం వల్ల వృద్ధుల ఆశ్రమంలో చేరడం వారసత్వం లాగా అయిపోంది. ఇప్పుడు మీరు తరువాత మీ అబ్బాయి" అంది.

"ఆయనముందు నా లాగా జీవితంలో దగాపడి చేరారా..?" అడిగాడు.

"అవును. ఏవోకారణాలు చెప్పి ఆస్తి అంతా తన పేరు మీద రాసుకున్న కొడుకు చేతిలో మోసపోయారు. మీ గురించి ఆయనకు అన్నీ తెలుసు. అందుకే ఫీజు తీసుకోలేదు అన్నయ్యా! ఆ స్వామిజీ ఎవరో కాదు. కొన్ని సంవత్సరాల క్రితం మీ చేతిలో దగాపడి మోసపోయి ఆశ్రమంలో చేరిన మన నాన్నగారు" అంది సమర్పిత.

"నా రాక్షసత్వాన్ని మరిచి నాకు బతుకుదెరువు కల్పించిన నాన్న రుణం ఎలా తీర్చుకోగలను. నాన్న కాళ్ళమీద పడి క్షమాపణ కోరాలి" అంటున్న అతని కళ్ళు శ్రావణమేఘాలై వర్షించసాగాయి.

★

చూద్దామా



పురాతన పుణ్యక్షేత్రం పండరీపురం

చంద్రభాగ నదీతీరాన వెలసిన అతిపురాతన దివ్యధామం పండరి. మహారాష్ట్ర సంస్కృతికి ఆధ్యాత్మికంగా హృదయస్థానాన్ని ఆక్రమించి, శతాబ్దాలుగా భక్తిపరిమళాలు వెదజల్లుతూ, మానవజీవితాన్ని సుసంపన్నం చేసిన పుణ్యభూమి పండరి. ఈవారం ఆ పుణ్యక్షేత్రం విశేషాలు తెల్సుకుందాం పదండి.



కురుద్వాడి, షేతపర్ల మీదుగా పండరి దారులన్నీ ఆలయం నాలుగుపక్కల నుంచీ తిరిగి చంద్రభాగ నదికి దారితీస్తాయి. భీమానదినే ఇక్కడ చంద్రభాగ అంటారు. ఇది మరికొంత దూరం వెళ్ళి కృష్ణానదితో సంగమిస్తుంది.

ముక్తిధామ్

ఇది వలయాకారంగా ఎన్నో అంతస్థులతో నిర్మించిన పెద్ద టవర్. విచిత్రమైన కట్టడం. ఒక్కో అంతస్థులో సిమెంటుతో మలచి రంగులు వేసిన అనేక పురాణగాథలు, సప్తర్షుల వేదాలు, భగవంతుని అవతారాలూ, మహాభక్తుల చరిత్రలూ ఇలా ఎన్నెన్నో దర్శనమిస్తాయి. ఒక్కో వలయాకారపు అంతస్థు చివర నాలుగు మెట్లు పైకెక్కి మరో నాలుగు మెట్లు కిందికి దిగితే మరో అంతస్థులోకి ప్రవేశిస్తాము. అక్కడ మళ్ళీ ఇతిహాస గాథలు ఇలా ముందుకు వెళ్లడమేగాని మధ్యలో వెనుదిరిగే దారిలేదు. ఎక్కడున్నామో మనకే తెలియదు. ఇలా మొత్తం 4 కిలోమీటర్ల దూరం వుంది. మధ్యలో మనం అలసిపోయినా లేక మరేదైనా జరిగినా ఉన్న మార్గమొక్కటే – మరింత ముందుకు సాగిపోవటం. ఈ నిర్బంధ ఆధ్యాత్మిక సాధన ముగించుకుని కిందికి దిగితే, ఇక్కడ ఇటీవలి రాజకీయ నాయకుల విగ్రహాలున్నాయి. మొరార్జీదేశాయి, జగజీవన్‌రామ్, వెంగళరావు, నీలం సంజీవరెడ్డి, శంకరరావు చవాన్, వై.బి చవాన్, నాయక్ వంటివారి విగ్రహాలు. ఇంతకుముందు దర్శించిన పురాణ పురుషులకూ, వీరికీ సారూప్యమేమైనా వుందేమోననిపిస్తుంది చూస్తుంటే.

చంద్రభాగ

నదీతీరమంతా ఎన్నెన్నో స్నానఘట్టాలున్నాయి. నీరు చాలా తక్కువగా వుండడం వల్ల సుదూరంగా పరచుకున్న మెట్లు ఈ క్షేత్రపు సనాతనత్వాన్ని సూచిస్తుంటాయి. సరిగ్గా నదిమధ్యలో పుండలీకుని చిన్నమందిరం వున్నది. ఈయన గాథ తరువాత చూద్దాం. ఇక్కడి క్షేత్రాచారాన్ననుసరించి ముందు చంద్రభాగలో స్నానమాచరించి, పుండలీకుని దర్శించుకుని తరువాత విఠలుని దర్శించుకోవాలి. ఈ నదీతీరాన

ద్వారకాధీశ మందిరముంది. ఇది చాలా పెద్ద ఆలయం. లోపల రాంఛోడ్ నిత్యపూజలందుకుంటున్నారు.

విఠలమందిరం

ఈ మహాపుణ్యక్షేత్రంలో అడుగిడటమే ఒక దివ్యానుభూతి. ఈ ఆలయానికి 9 ద్వారాలున్నాయి. ఇది నవవిధ భక్తిమార్గాలకు సంకేతమేమో! ముఖద్వారం తూర్పుదిశగా వుంది. దీనిని నాయదేవ ద్వారమంటారు. ఇది 14వ శతాబ్దపు నిర్మాణం. ఆలయంలోకి ప్రవేశించగానే అతిపురాతనమైన ముఖ మంటపం ఉంది. దీనిలో ఒక స్తంభంమీద గరుడుని విగ్రహం మలచారు. అందుకే దీనిని గరుడ స్తంభమని అంటారు. ఆయన శ్రీమహావిష్ణువుకు వాహనంగదా! ఇక్కడ కూడా పూజలు చేస్తుంటారు. దీని తరువాత విశాలమైన గర్భగుడిలో విఠోభా కటిహస్తుడై, కరుణామృత దృక్కులు ప్రసరిస్తుంటారు. ఇక్కడి విఠలుని విగ్రహం చూడగానే ఒక్కసారిగా మైమరిచిపోతాం. శతాబ్దాలుగా మహారాష్ట్ర జీవనస్రవంతిలో ఆధ్యాత్మిక బిందువుగా దివ్యప్రభలీనిన చైతన్యమూర్తి. గుడికి పక్కగా చెక్కలతో నిర్మించిన దాదాపు 20 అడుగుల ఎత్తున్న పురాతన మంటపముంది. ఇంత ఎత్తున చెక్కిన స్తంభాల అమరిక చూసి విస్తుబోయాను. ఇక్కడ కొంతమంది భక్తులు మెడలో పూలమాలలు ధరించి, చిడతలు, మృదంగ వాద్యాలతో లయబద్ధంగా అడుగులు వేస్తూ పారవశ్యంతో నామసంకీర్తన చేస్తున్నారు. ఇలా పదాలు పాడడంలో మహారాష్ట్రకు ఒక విశిష్టస్థానముంది. ఇది భక్తిమార్గంలో ఒక విశిష్టస్థాయికి చేర్చగల సులభమైన ప్రక్రియ. భక్తితరంగాలతో నిండిన విఠలుని సన్నిధికి చేరాను. కలియుగ వైకుంఠంగా ప్రసిద్ధికెక్కిన ఈ మహాక్షేత్రంలో సరిహద్దు గీతలు లేవు. భక్తులందరూ విఠలుని పాదాలు తాకి నమస్కరించుకోవచ్చు. విఠల మందిరం పక్కనే రుక్మిణీ ఆలయం ఉంది.

ప్రతి హిందువూ వైకుంఠధామంగా భావించే చైతన్యకేంద్రం పండరి. ఇక్కడ ప్రభవించినంతమంది మహాభక్తులు మరే పుణ్యక్షేత్రంలోనూ

కనిపించరంటే అతిశయోక్తికాదు. చంద్రభాగ పవిత్ర తరంగాలు, పండరిలో పెల్లుబికే ఆధ్యాత్మిక తరంగాలతో కలిసి ఇక్కడొక దివ్యధామాన్ని ఆవిష్కరించాయి. అదే మహారాష్ట్రుల హృదయనాడి, పండరీపురం.

ఉత్సవాలు

ఇక్కడ జరిగే ప్రధాన ఉత్సవాలు రెండు ఆషాఢశుద్ధ ఏకాదశి- కార్తీకశుద్ధ ఏకాదశినాడు జరుగుతాయి. ఇవి కేవలం ఆలయంలో జరిగేవి కావు. మహారాష్ట్ర నాలుగు చెరగులనుంచీ భక్తబృందాలు తరలివస్తాయి. ఈ యాత్రను "వారి" అని, అలా వచ్చే భక్తులను "వార్కరీ" అనీ అంటారు. అలంది గ్రామంనుంచి మహాభక్తుడు జ్ఞానేశ్వర్ వారి పాదుకలతో ఒక బృందం బయలుదేరితే, దేహు గ్రామంనుంచి తుకారాములవారి పాదుకలతో మరో బృందం కదులుతుంది. సాలంకృతమైన పల్లకిలో ఈ పాదుకలనుంచి చిడతలూ ధరించి హరినామ సంకీర్తనతో కాలినడకన 15 రోజులు సాగుతుందీ పండరీయాత్ర. దారిలో ఒక్కో గ్రామంలో విడిదిచేస్తూ అక్కడ భక్తి పారవశ్యంతో సంకీర్తన చేస్తూవుంటే, ఆయా గ్రామస్తులు వీరికి ఆతిథ్యమిస్తారు. ఆ గ్రామంనుంచి 'వారిలో పాల్గొనగోరే భక్తులు వీరితో చేరుతారు. ఈ బృందాలను దిండీ' లంటారు. ఇలా దాదాపు 250 కిలోమీటర్ల దూరం పాదచారులై ఈ నామసంకీర్తన యజ్ఞంలో దారి పొడవునా గ్రామాలనుంచి వచ్చి చేరే భక్త సమూహంతో ఒక మహాప్రవాహమై పండరి చేరుతుందీ భక్తబృందం.

చంద్రభాగ నదిలో పుణ్యస్నానాలు చేసి, ఏకాదశినాడు పండరీనాథుని దర్శించి పూజిస్తారు. నిరాడంబర భక్తియే ప్రధానంగా సాగే ఈ ఉత్సవాల సమయంలో భక్తితరంగాల స్పందనలో పండరి మునిగిపోతుంది. అనాదిగా భక్తిమార్గానికి కేంద్రమై, భీమానదీ తీరాన వెలసిన మహాయోగపీఠం పండరి. భక్తికి ఏ భేదాలూ, అవధులూ వర్తించవు, అది విశ్వవ్యాప్త తరంగం. ఈ మూర్తికి 'విఠల' నామం ప్రాచుర్యం పొందింది. ఇన్ని శతాబ్దాలుగా అసంఖ్యాక భక్తజనులు పునీతం చేసిన విఠలుని భక్తుల్లో అన్నికులాల, ప్రాంతాలవారూ ఉన్నారు. నందదాస్ బ్రాహ్మణుడు, చోఖా పంచముడు, తుకారాం వ్యాపారి, రోహిదాసు దళితుడు, జనాబాయి సేవిక, కానోపాత్ర వేశ్య, నామదేవ్ దర్జీ, గోరా కుమ్మరి, సవితా తోటమాలి, సేనా మంగలి. ఇలా కులమత లింగ భేదాలనతిక్రమించి, భక్తి అనే అమృతభాండంలో మునిగి, తాము తరించి, తోటివారిని తరింపజేశారు. స్త్రీలు ఆధ్యాత్మిక సాధనలకనర్హులని భావించే కాలంలో అది ఎంత తప్పో ఈ భక్తులు నిరూపించారు. సన్యాసాశ్రమమే మోక్షద్వారమని తలచే కాలంలో వీరు గృహస్థులుగా జీవించి, నిజమైన ఆధ్యాత్మికత ఎలా ఉంటుందో నిరూపించారు. ఈ విశిష్ట సత్యాన్ని ఆవిష్కరించే కేంద్రబిందువు పండరి.

★

ముక్తిధామ్



విఠలమందిరం

కొత్త పుస్తకాలు

కుంచె సామ్రాజ్య మహారాజు

తెలంగాణాలో పుట్టి జాతీయ స్థాయిలో గొప్ప చిత్రకారునిగా చరిత్ర సృష్టించిన శేషగిరిరావుగారి జీవిత చరిత్రను వారి కోడలు నీహారిణి రాయడం ప్రశంసనీయం. శేషగిరి రావుగారు మంచి వ్యాసకర్త-కవి-చిత్రకారుడు. పోర్ట్రయిట్లు వేసే నైపుణ్యంలో ఆయనకు ఉన్న శక్తి అద్భుతం. "కొండపల్లి బొమ్మలంత ప్రసిద్ధమైనవి కొండపల్లి శేషగిరిరావుగారి బొమ్మలు" అంటారు వరవరరావు తన అభిప్రాయంలో. తెలంగాణా గర్వించదగిన చిత్రకారుల్లో కాపు రాజయ్య, పి.టి.రెడ్డి, కొండపల్లి శేషగిరిరావు ప్రసిద్ధులు. తెలుగునాట వడ్డాది పాపయ్య, అడవి బాపిరాజు, బాపు, దామెర్ల రామారావు లాంటి చిత్రకారులు తెలుగుజాతి ఖ్యాతిని విశ్వానికి చాటారు. కళ ప్రకృతి అనుసృజన. "కుంచె సామ్రాజ్య మహారాజు" అంటూ మోహన్ పరిచయ వ్యాసం రాశారు. శేషగిరిరావుని పొగుడుతూ డా॥సి.నా.రె, డా॥బిరుదురాజు రామరాజు, దాశరథి రాసిన పద్యాలు.. 1924 జనవరి 27న జన్మించిన శేషగిరిరావు గారి జీవిత విశేషాలు.. ప్రఖ్యాత చిత్రకారులైన దేవీప్రసాద్‌రాయ్‌చౌదరి, నందాలాల్ బోస్ చిత్రాలతో ప్రభావితమై, బోస్ శిష్యుడై... గొప్ప చిత్రకారునిగా శేషగిరిరావు జీవిత పయనాన్ని రచయిత్రి చక్కగా రాశారు.



చిత్ర కళాతపస్వి డా॥ కొండపల్లి శేషగిరిరావు జీవిత చరిత్ర
రచన : కొండపల్లి (పెండ్యాల) నీహారిణి,
పేజీలు : 270,
వెల : 200 /-రూ,
ప్రతులకు : కె.వేణుగోపాలరావు,
1-2-214/5/1, గగన్‌మహల్ రోడ్,
దోమల్‌గూడ, హైదరాబాద్ - 500029.

రామప్పదేవాలయంలోని రాగిణి, నాగిణి శిల్పాలు, వేయిస్తంభాల దేవాలయ ప్రాంగణంలోని శిల్పాలు.. శేషగిరిరావు స్కెచ్‌లు వేయడానికి దోహదపడ్డాయి. ఆయన తొలి రోజుల్లో.. 1942లో హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చేరడం.. మెహదీ నవాజ్ జంగ్ తోడ్పాటు (పేజీ.21), సాలార్జంగ్‌తో పరిచయం (పేజీ.31), శాంతినికేతన్‌లో విద్యాభ్యాసం-చిత్రకళలో నందాలాల్ శిష్యరికం లాంటి ఎన్నో అంశాలు.. చక్కటి వర్ణ చిత్రాలు.. ఈ పుస్తకంలో ఉన్నాయి. తెలుగు తల్లి రూపచిత్రణ, ప్రపంచ తెలుగు మహాసభల్లో శేషగిరిరావు పాత్ర, వారి "కుంచె కళాప్రయోజనం కోసం" ఎలా ఉపయోగపడింది వంటి అంశాలెన్నో ఇందులో ఉన్నాయి.... పాబ్లో పికాసో(1881-1973), రాజా రవివర్మను (1848-1902) చూసి మనమెంత ఉత్తేజం పొందుతామో అంతే ఆనందం-స్ఫూర్తి 'కొండపల్లి' వారి కుంచె నుంచి జాలువారిన ప్రతి చిత్రం నుండీ పొందుతాం. నీహారిణి ఎన్నో ప్రయాసలకోర్చి మామగారిపై పుస్తకం తెచ్చి విలువైన సేవ చేశారు. అభినందనీయం.

- తంగిరాల

ప్రయోజనకారి

వ్యక్తిత్వ వికాసం, గెలుపు, జయం, విజయం లాంటి విషయాలపై ఇప్పటికే ఎన్నో పుస్తకాలు వచ్చినా.. ఎంతో ప్రాధాన్యమైన, విలువైన అంశాలతో ఈ పుస్తకం రూపొందించిన రాజేశ్వరరావు అభినందనీయులు. పాఠశాల విద్యార్థి నుండి పెన్షన్ పొందే వృద్ధులదాకా.. ఉద్యోగార్థుల నుండి ఉద్యోగాలు ఇచ్చే మేనేజర్ల దాకా ఎన్నో అంశాలు.. ఈ చిరు పుస్తకంలో చక్కగా వివరించారు. కన్‌ఫ్యూసియస్, ఎడ్వర్డ్ హబర్ట్, జె. ఆర్. మిల్లర్, హెచ్-లాంగ్ ఫెలో, ఎస్. జాన్సన్, డబ్ల్యు. పెన్‌లాంటి పాశ్చాత్య మేధావుల ఆలోచనలు- సూచనలు... వృద్ధాప్యం గురించి (పేజీ-109) ఆకాలక్రమంలో విజయానికి మేధావులు సూచించిన సూక్తులు.... (పేజీ-121) చివరలో ప్రచురించారు. జ్ఞాపకశక్తి వృద్ధి చేసుకోవడమెలా? అనే 27వ చాప్టర్ (పేజీ.70) చాలా విలువైనది. సరస్వతి లేహ్యం, జ్ఞాపకశక్తికి గుళికలు... మందులు.. సరస్వతీదేవి ఉపాసకుల ముసుగులో అమ్ముతున్న అక్షర (అవధాన) పండితులున్న మన మధ్య ఈ వ్యాసం చాలా బాగా ఆలోచింప చేస్తుంది. 'వ్యాయామం బరువు' అనే 24వ అధ్యాయంలో (పేజీ.51) ఆరోగ్య సంబంధమైన అంశాలు.. స్త్రీ, పురుషులు 20 నుండి 60 వరకు.. స్త్రీ పురుషులలో వయసు, ఎత్తును బట్టి ఉండవలసిన బరువులు.. (పేజీ.4) గురించి రాశారు. బాగానే వుంది. ఆహారపు అలవాట్లు, శాకాహారులు.. మాంసాహారులు గైకొనాల్సిన ఆహారపు మోతాదులు... పోషక విలువలు కూడా ఇస్తే బాగుండేది. విద్యార్థులకు, నిరుద్యోగ యువతీ యువకులకు... చక్కటి మార్గదర్శిలా, ప్రయోజనకారిగా, ఓ మంచి మిత్రునిగా ఈ పుస్తకం ముందుకు నడిపిస్తుంది. వ్యక్తిత్వ వికాసం కోసం మనదేశంలో కూడా ఎందరో యోగ సాధకులు.. ఆధ్యాత్మికవాదులు, భౌతిక. వాదులు.. విశేష కృషి చేశారు కదా! వారి గురించి, వారి సూక్తుల గురించి ఆలోచనా విధానాలా గురించి కూడా చెబితే మరింత శక్తివంతంగా ఈ పుస్తకం నిలబడుతుంది. మలి ముద్రణలో ఆలోచించగలరు.



- చక్రవర్తి

మీ విజయానికి చిట్కాలు
కూర్పు-సంపాదకుడు : పి. రాజేశ్వరరావు.
పేజీలు: 125, వెల: 40/-
ప్రతులకు : విశాలాంధ్ర పుస్తక విక్రయశాలలు.



ఏం విరుపులు! ఏం వంపులు!!

'ఈ అమ్మాయి పెట్టిన ఫోజులు చూస్తుంటే ఏమనిపిస్తోంది?'

'......'

'ఏంటీ నోట్లోంచి మాట రావడంలేదు?'

'ఏం మాట్లాడతామండీ? ఆ విరుపులు ఆ వంపులు చూస్తుంటే మెదడంతా ఖాళీ అయిపోయింది. ఇంక నోరెలా తెరుస్తాం?!'

'అది తెలుస్తూనేవుంది బాస్. అసలు ఇలా ఎలా చేయగలుగుతోందంటారు?'

'అదే కదా మా ప్రశ్న కూడా. మనలో మాట. లోపల ఎముకల స్థానంలో ఎలాస్టిక్ ముక్కలేమైనా వున్నాయేమో!'

'అదేం కాదు. ఆమె కూడా మనలాంటి మనిషే. కాకపోతే ఏ భాగాన్నైనా ఎటు కావాలంటే అటు తిప్పేస్తోంది'

'ఇంతకీ ఈ అమ్మాయి ఎవరంటారు?'

'ఆ ఒక్కటి అడక్కండి. దేనికోసమో నెట్‌లో పడి వెతుకుతుంటే అనుకోకుండా ఈ చిత్ర విచిత్ర భంగిమల చిత్రాలు దొరికాయి. మీరు కూడా చూసి తరిస్తారని ఇలా పేజీలో పెట్టేశాం'

'అవునూ...ఇలా కాళ్లూ, చేతులూ, నడుమూ ఎలా పడితే అలా వంగడానికి ఆమెగానీ ప్రత్యేకమైన శిక్షణా, సాధనా చేసిందంటారా?'

'ఈమె సంగతి తెలీదుగానీ...యోగా, తాయ్ చీ, మార్షల్ ఆర్ట్స్, ఈత వంటివి చేస్తే మాత్రం మన శరీరభాగాలను ఎటు కావాలంటే అటు తిప్పగలిగే శక్తిసామర్థ్యాలు లభిస్తాయని చెప్తుంటే విన్నాం. అయితే ఈ ఫొటోలు చూసి టెమ్ట్ అయిపోయి ఉన్నపళంగా చేస్తే మాత్రం ఇక జీవితాంతం అదే భంగిమలో గడపాల్సి వస్తుంది. అదన్నమాట సంగతి.'





ఎలుక పెళ్లి



- చూటీ

గంగానది ఒడ్డున అనేకమంది మునులు, సన్యాసులు నివసించేవారు. వారందరిలోకి ఓ ముని బాగా తెలివిగలవాడు. అతను ఓసారి గంగానదిలో స్నానం చేసి సూర్యనమస్కారం చేస్తుండగా... ఆకాశంలో గద్ద ముక్కునుంచి జారిన ఎలుక ఒకటి చేతిలో పడింది. ముని దాని వైపు చూస్తాడు. అది చాలా చిన్నగా, అందంగా, అమాయకంగా కళ్లార్పుతూ అతన్నే చూస్తోంది. ఎందుకో ఆ ఎలుక మునికి నచ్చింది. తన దగ్గరే అట్టిపెట్టుకోవాలనుకున్నాడు. తన శక్తులన్నీ ఉపయోగించి ఎలుకను చిన్న పాపాయిగా చేసి ఇంటికి తీసుకెళతాడు.

భార్యనుద్దేశించి "నువ్వు ఎప్పుడూ ఓ కూతురుంటే బావుండేది అంటుంటావుకదా. ఇదిగో తీసుకొచ్చాను.జాగ్రత్తగా ప్రేమగా చూసుకో" అంటాడు.

ముని భార్య పాపను చూసి ఎంతగానో సంతోషిస్తుంది. తనకోసం అన్నీ చేస్తాననీ, యువరాణిలా పెంచుతానని చెప్తుంది.

సంవత్సరాలు గడిచిపోతాయి. పాప పెరిగి పెద్దదై ప్రపంచంలోకెల్లా అందమైన యువతిగా తయారౌతుంది. ముని దంపతులు ఆమెకు వివాహం చెయ్యాల్సిన సమయం వచ్చిందనుకుంటారు. ఆమెకు తగిన వరుణ్ణి తీసుకురావాలనుకుంటారు.

"మన అమ్మాయికి చాలా గొప్పవాడితో పెళ్లి చేయాలి. అంతటి గొప్పవాడు మరొకడు వుండకూడదు. సూర్యుడు అందరిలోకి గొప్పవాడనుకుంటున్నాను" అంటాడు ముని.

అతని భార్య కూడా ఆ మాటతో ఏకీభవిస్తుంది.

సన్యాసి తన శక్తులన్నిటినీ ఉపయోగించి సూర్యుణ్ణి కిందకి రమ్మంటాడు. సూర్యుడు వస్తాడు.

"నన్ను ఎందుకు పిల్చావు?" అంటాడు సూర్యుడు.

"నువ్వు మా అమ్మాయిని పెళ్లాడాలి. ఆమె చాలా అందంగా వుంటుంది. పైగా చాలా మంచిది. ఆమె నీకు మాత్రమే తగిన అమ్మాయి" అంటాడు.

అప్పుడు అక్కడే వున్న అమ్మాయి "నాన్నా! నేను ఇతన్ని పెళ్లి చేసుకోలేను. ఎందుకంటే ఇతను బాగా వేడిగా వుంటాడు" అంటుంది.

"అవును. ఆమె సరిగ్గా చెప్పింది. పైగా మేఘం నన్ను కప్పేసినప్పుడు నేను వెలుగును కోల్పోతాను" అంటాడు సూర్యుడు.

దాంతో ముని మేఘుడిని కిందకి పిలుస్తాడు. మేఘుడు కిందికి వస్తాడు.

"ఆర్యా! నన్ను కిందికి ఎందుకు పిల్చారు?" అంటాడు మేఘుడు.

అతను మాట్లాడకముందే.. ముని కుమార్తె కలుగచేసుకొని

"నేను ఇతన్ని పెళ్లి చేసుకోను. ఇతను చాలా మసగ్గా, నల్లగా వున్నాడు. ఇతనికంటే మెరుగైన వ్యక్తిని చూడకూడదా?" అంటుంది.

అప్పుడు మేఘుడ్ని "నీకంటే గొప్పవారు ఎవరైనా వున్నారా?" అనడుగుతాడు ముని.

"ఆ...నాకంటే వాయు గొప్పవాడు. అతను మాత్రమే నన్ను ఎక్కడికంటే అక్కడికి లాక్కుపోగలడు. అంత శక్తి అతనికే వుంది" అంటాడు.

ముని వాయుని కిందికి పిలుస్తాడు. అతను కిందికి వస్తాడు.

"నన్ను ఎందుకు పిల్చారు స్వామీ?" అంటాడు వాయు.

"నువ్వు మా అమ్మాయిని పెళ్లాడాలి" అంటాడు ముని.

"లేదు నాన్నా... నేను ఇతడ్ని పెళ్లాడలేను. ఎందుకంటే ఇతను ఎప్పుడూ పరుగెడుతూనే వుంటాడు. ఒక్క క్షణం కూడా ఎక్కడా ఆగడు" అంటుంది.

దాంతో ముని వాయు వైపు "నీకన్నా బలవంతుడు, గొప్పవాడు ఎవరైనా వుంటే చెప్పు" అంటాడు.

"నాకన్నా గొప్పవాడు, శక్తివంతుడు ఒకరున్నారు. అతనే పర్వతుడు" అంటాడు.

ముని అతణ్ణి కూడా పిలిపిస్తాడు. అతన్ని చూచిన ముని కుమార్తె...

"నాన్నా ఇతను మరీ పొడవుగా వున్నాడు. మొరటుగా కూడా వున్నాడు. నేను ఇతడ్ని పెళ్లి చేసుకోను" అంటుంది.

దానికి ముని నీరసపడిపోయి "నీకంటే గొప్పవాడు, శక్తివంతుడు ఎవరైనా వున్నారేమో చెప్పు" అంటాడు.

"నేను ఇంత బలంగా వున్నా...నాకు కూడా రంధ్రాలు వేయగల శక్తిమంతుడు ఒకడున్నాడు. వాడే ఎలుక" అంటాడు.

ముని ఎలుకను పిలిపిస్తాడు. ఎలుకను చూచి ముని కుమార్తె సంతోషంగా కేరింతలు కొడుతూ...

"నాన్నా! నాకు ఇతను నచ్చాడు. మనస్ఫూర్తిగా ఇతడ్ని పెళ్లాడతాను" అంటుంది.

ముని వెంటనే తన పెంపుడు కుమార్తెకు అసలు రూపు ప్రసాదిస్తాడు. ఆ రెండు ఎలుకలకూ వివాహం జరిపించి సుఖసంతోషాలతో జీవించమని దీవించి పంపుతారు ముని దంపతులు.